


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

28.07.2026

మంగళవారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 77

పేజీలు : 12 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## రెండు వారాల్లోగా నివేదిక సమర్పించండి

- అయోధ్య విరాళాల చోరీపై సుప్రీం
- రికార్డుల తనిఖీకి ఫొరెన్సిక్ నిపుణుడి అవసరం
- సిట్ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు
- చార్టర్డ్ అకౌంటెంట్‌ను సభ్యుడిగా చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశం
- ఐజీ కిరణ్ ఎస్. నేతృత్వంలో దర్యాప్తు

2లో..

# అలర్ట్‌గా ఉండాలి

- సీఎం చంద్రబాబు నాయుడు
- ఎల్ నినో ప్రభావంపై అధికారులకు ఆదేశాలు
- రైతులకు అవగాహన కల్పించాలి
- ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా ప్రోత్సహించాలి
- క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన చేపట్టాలి
- పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలి
- ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉంది
- ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి శాఖల పనితీరుపై సమీక్ష



అమరావతి, జులై 27, అనంతజనశక్తి న్యూస్
ఎల్ నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఏపీ సచివాలయంలో ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్ నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు... రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు.. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దీని నిమిత్తం క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ఏ ప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనేదానిపై రైతులకు వివరించాలని చెప్పారు.

పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని ాచించారు సీఎం చంద్రబాబు... రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉందని చెప్పారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరును చదివి వినిపించినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. మరోవైపు, రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను సీఎం చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందని అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు... టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..

**యువత ధైర్యంగా నిలబడాలి!**

పోలవరం జిల్లాలోని రంపచోడవరం మండలం ఇర్లపల్లిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పదో తరగతి చదువుతున్న ముర్రం శివాని సోమవారం ఉదయం ఇంటి సమీపంలోని రేకుల షెడ్‌లో ఉరివేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శివాని మృతికి గల కారణాలు తెలియరాలేదు. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు విద్యార్థిని మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించారు.



2లో..

### కేసుల విత్‌డ్రాపై

## ఆదేశాలు లేవు

- సీజేపీ నిరసనపై ఢిల్లీ పోలీసులు
- కేసుల ఉపసంహరణ వ్యవహారం
- ప్రభుత్వం ఆదేశిస్తేనే చట్టపరమైన ప్రక్రియ

న్యూఢిల్లీ, జులై 27, అనంతజనశక్తి న్యూస్
కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ), యువత జంతర్ మంతన్ వద్ద చేసిన నిరసనల్లో నమోదైన కేసుల్ని విత్ డ్రా చేసుకోవాలి కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదని ఢిల్లీ పోలీస్ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయిన తర్వాత మాత్రమే చట్టపరమైన ప్రక్రియ ప్రారంభం అవుతుందని, చివరకు కోర్టులదే నిర్ణయమని చెప్పినట్లు సమాచారం. సీజేపీ ఆందోళన విరమణకు పెట్టిన షరతుల్లో కేసుల ఉపసంహరణ కూడా ఉంది. ప్రభుత్వం దీనికి అంగీకరించింది.

2లో..

### దుబాయ్–ముంబై ఇండిగో

## విమానంలో మంటలు

- రాజ్‌కోట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్
- 194 మంది ప్రయాణికులు సురక్షితం



2లో..

### టీడీపీలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ

## స్థానాల కోసం హోరాహోరీ పోటీ

- రెండు స్థానాలకు 20 మందికిపైగా ఆశావహులు..
- సామాజిక, ప్రాంతీయ సమీకరణాలపై చంద్రబాబు-లోకేష్ దృష్టి

10లో..

అమరావతి, జూలై 27:
అనంత జనశక్తి న్యూస్
గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ తెలుగుదేశం పార్టీలో తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. కేవలం రెండు స్థానాల కోసం 20 మందికిపైగా సీనియర్ నేతలు, మాజీ మంత్రులు, పార్టీకి సేవలందించిన నాయకులు పోటీపడుతుండటంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అభ్యర్థుల పేర్లను నేడో, రేపో ప్రకటించే అవకాశం ఉండటంతో పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

### నాణ్యమైన బియ్యం

## కిలో రూ.52కే లభ్యం

ఆగస్టు 1 నుంచి అందుబాటులోకి డిప్యూటీ సీఎం పవన్ ప్రకటన



2లో..

### కేంద్రం హామీలను

## నిలబెట్టుకోవట్లేదు

- సీజేపీ ప్రతినిధుల ఆరోపణలు
- కేసులు ఉపసంహరించుకోవాలి

న్యూఢిల్లీ, జులై 27, అనంతజనశక్తి న్యూస్
కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించుకుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు.

2లో..

## బతకాలని ఉన్నా.. బాధ భరించలేకపోతున్న

- చంద్రబాబును స్పీచ్‌తో మెప్పించిన బాలిక ఆత్మహత్య
- కన్నీళ్లు పెట్టిస్తున్న సూసైడ్ నోట్
- విచారణకు ఆదేశించిన సీఎం

అమరావతి, జులై 27, అనంతజనశక్తి న్యూస్
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును తన ప్రసంగంతో ఆకట్టుకున్న పదో తరగతి విద్యార్థిని శివాని ఆత్మహత్య తీవ్ర విషాదాన్ని నింపింది. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం ఇర్లపల్లి కొత్త కాలనీలో శివాని ఆత్మహత్య చేసుకుంది. శివాని రేకుల షేడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సోమవారం ఉదయం గుర్తించారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఆస్పత్రికి తరలించారు.

2లో..



### ఆకివీడులో రామాలయ నిర్మాణానికి

## సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

- ఆలయ నిర్మాణాన్ని సవాలు చేస్తూ..
- దాఖలైన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం కోర్టు

అమరావతి, జులై 27, అనంతజనశక్తి న్యూస్
పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేటలో రామలయం నిర్మాణానికి సంబంధించి జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్ఓసీ) సుప్రీంకోర్టు సమర్థించింది. ప్రభుత్వ భూమిలో ఆలయ నిర్మాణాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే ఈ ప్రాజెక్టుపై ఏవైనా సరైన అభ్యంతరాలు ఉంటే, కొత్తగా పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని కోర్టు పేర్కొంది. ఆ ప్రదేశంలో 80 ఏళ్లకు పైగా రామ మందిరం ఉన్నట్లు రికార్డులు సూచిస్తున్నాయని, ఆకివీడులో రామలయం నిర్మాణానికి ఎలాంటి చట్టపరమైన అడ్డంకి లేదని సుప్రీంకోర్టు పేర్కొంది.

11లో..

## డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధం

- జగన్‌కు లోకేశ్ సవాల్
- జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' జబ్బు
- వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్, భూకుంభకోణాలు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం



2లో..

అమరావతి, జులై 27, అనంతజనశక్తి న్యూస్
డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ అధినేత జగన్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంపై జగన్‌తో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, దమ్ముంటే చర్చకు రావాలని ఆయన అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్, జగన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



## కేసుల విత్‌డ్రాపై ఆదేశాలు లేవు

న్యూఢిల్లీ, జులై 27, అనంతజనశక్తి న్యూస్

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), యువత జంతర్ మంతర్ వద్ద చేసిన నిరసనల్లో నమోదైన కేసుల్ని విత్ డ్రా చేసుకోవాలి కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదని ఢిల్లీ పోలీస్ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయిన తర్వాత మాత్రమే చట్టపరమైన ప్రక్రియ ప్రారంభం అవుతుందని, చివరకు కోర్టులదే నిర్ణయమని చెప్పినట్లు సమాచారం. సీజేపీ ఆందోళన విరమణకు పెట్టిన షరతుల్లో కేసుల ఉపసంహరణ కూడా ఉంది. ప్రభుత్వం దీనికి అంగీకరించింది.
ఇదిలా ఉంటే, నిరసనల సందర్భంగా జర్నలిస్టులపై దాడి జరిగిందంటూ నమోదైన కేసులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఉపసంహరించుకునేది ఢిల్లీ పోలీసులు చెబుతున్నట్లు తెలుస్తోంది. జూలై 20న చేపట్టిన పార్లమెంట్ మార్చ్ ర్యాలీ హింసాత్మకం మారడంతో, నిరసనకారులపై చాలా కేసులో నమోదయ్యామయి. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు 20 కేసులు నమోదయ్యాయి. మిగిలినవి జర్నలిస్టులపై దాడుల కేసులని పోలీసులు తెలిపారు. ప్రభుత్వం కేసుల ఉపసంహరణపై ఆదేశాలు జారీ చేస్తే, ప్రాసిక్యూషన్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు నివేదిక పంపుతుంది. ఆమోదం తర్వాత సంబంధిత కోర్టులకు ప్రాసిక్యూషన్ కొనసాగించబోమని పోలీసులు తెలియజేస్తారు. అనంతరం కేసులపై తుది నిర్ణయం కోర్టులు తీసుకుంటాయి.

## కేంద్రం హామీలను నిలబెట్టుకోవట్లేదు

(మొదటిపేజీ తరువాయి)

అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళనకారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించుకోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా , జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

**బిహార్‌లో విద్యార్థులపై ఏకే-47 తుపాకులు: రాహుల్ గాంధీ**

బిహార్‌లో విద్యార్థులు నిరసన చేస్తున్న సమయంలో పోలీసులు వారిపైకి ఏకే47 తుపాకులతో కాల్పులు జరిపారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దిల్లీలోనూ విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు వాడారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మాట నిలుపుకోదని.. విద్యార్థుల గొంతులను అణచివేసేందుకే వారు తప్పుడు హామీలు ఇచ్చారని విమర్శించారు. కాగా.. జులై 25న 'బిహార్ బంద్' సందర్భంగా జరిగిన ఆందోళనల సమయంలో సివాన్ జిల్లాలో ఓ పోలీసు కానిస్టేబుల్ నిరసనకారులపై ఏకే47 ఎక్కుపెట్టిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో ఇది వివాదాస్పదమైంది. ఈ క్రమంలోనే సదరు కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

## అలర్ట్‌గా ఉండాలి



(మొదటిపేజీ తరువాయి)

'ఇర్లపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థిని శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్లో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆ రోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవ్వడం నన్ను కలిచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా.. విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవ్వరూ ఒత్తిడికి, నిరాశ, నిస్పృహలకు లోనుకావొద్దని కోరుతున్నాను. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధను, ఆవేదనను మీ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని తెలియజేస్తున్నా' అని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు.

## కర్ణాటక విజ్ఞప్తిని తిరస్కరించిన ధర్మాసనం

### కృష్ణా జలాల్లో వాటాపై సుప్రీంకోర్టులో విచారణ

అమరావతి, జులై 27, అనంతజనశక్తి న్యూస్

కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున.. ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది.

**ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.**

# రెండు వారాల్లోగా నివేదిక సమర్పించండి

లక్నో, జులై 27, అనంతజనశక్తి న్యూస్



అయోధ్య రామ మందిర విరాళాల చోరీ దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. అయితే, ఈ కేసును సోమవారం సుప్రీంకోర్టు విచారించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ముందు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం తన వాదనల్ని వినిపించింది. రాష్ట్ర ప్రభుత్వం తరుపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. పారదర్శకమైన దర్యాప్తు జరిగేలా చూసేందుకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసినట్లు కోర్టుకు తెలియజేశారు.
ఇదిలా ఉంటే, సీనియర్ ఐపీఎస్ అధికారులతో పాటు ఫోరెన్సిక్ ఆడిట్‌లో అనుభవం ఉన్న చార్టర్ట్ అకౌంటెంట్‌ను సభ్యులుగా చేర్చిన కొత్త సిట్ ఏర్పాటు చేయాలని యూపీ సర్కార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. కొత్త సిట్‌కు లక్నో రేంజ్ ఐజీ కిరణ్ ఎస్. నేతృత్వం వహించనున్నారు. సభ్యులుగా అయోధ్య రేంజ్ డీఐజీ సోమెన్ బర్మా, అయోధ్య ఎస్ఎస్పీ గౌరవ్ గ్రోవర్ ఉన్నారు. కోర్టు సూచన మేరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిపుణుడైన చార్టర్డ్ అకౌంటెంట్‌ను కూడా సిట్‌లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.
నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉన్నందున ఆర్థిక అంశాలను పరిశీలించేందుకు నిపుణులు అవసరమని కోర్టు అభిప్రాయపడింది. విచారణ సందర్భంగా పిటిషన్ల తరుపు న్యాయవాది, ఆలయానికి వచ్చే నిధులు, విరాళాల వివరాలను ట్రస్ట్ వెబ్ సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. అయితే, ఈ అంశాన్ని అనవసరంగా సంచలనంగా మార్చొద్దని సొలిసిటర్ జనరల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసు దర్యాప్తుపై రెండు వారాల్లో స్టేటస్ రిపోర్టు సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# దుబాయ్–ముంబై ఇండిగో విమానంలో మంటలు

ముంబై, జులై 27, అనంత జనశక్తి న్యూస్

దుబాయ్ నుంచి ముంబైకి వస్తున్న ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. విమానంలో పొగలు రావడంతో సోమవారం అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో రాజ్‌కోట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసింది. విమానంలో మంటలు కనిపించడంతో అప్రమత్తమైన పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. దీంతో అధికారులు వెంటనే స్పందించి అన్ని ఏర్పాట్లు చేశారు. పైలట్ అప్రమత్తతతో విమానం సురక్షితంగా రాజ్‌కోట్ విమానాశ్రయంలో దిగింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అంబులెన్స్‌లు విమానాశ్రయంలో సిద్ధంగా ఉంచారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే ప్రయాణికులందరినీ సురక్షితంగా బయటకు తరలించారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. దీంతో విమానంలో ఉన్న 194 మంది ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. విమానంలో పొగ కనిపించడంతో పైలట్ వెంటనే రాజ్‌కోట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. పరిస్థితిని అంచనా వేసిన అధికారులు వెంటనే రన్‌వేను సిద్ధం చేసి విమానాన్ని సురక్షితంగా దించారు. రాజ్‌కోట్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని తెలిపారు. ఇటీవలి నెలల్లో ఇండిగో విమానానికి సంబంధించి ఇది రెండో అత్యవసర ఘటన కావడం గమనార్హం. గత మే నెలలో హైదరాబాద్ నుంచి చండీగఢ్‌కు వెళ్లిన ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ పేలడంతో క్యాబిన్‌లో పొగ వ్యాపించింది. ఆ సమయంలో విమానం షహీద్ భగత్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయి పార్కింగ్ బే వైపు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. విమాన సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తీసుకొచ్చినప్పటికీ.. క్యాబిన్ మొత్తం పొగతో నిండిపోవడంతో అత్యవసరంగా ఇన్‌ఫ్లేటబుల్ స్లైడ్‌ల ద్వారా ప్రయాణికులను బయటకు తరలించారు. ఆ ఘటనలో ఒక ప్రయాణికుడు స్వల్పంగా గాయపడగా.. మిగిలిన వారందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రస్తుతం దుబాయ్‌ముంబై ఇండిగో విమానంలో పొగ రావడానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# బతకాలని ఉన్నా.. బాధ భరించలేకపోతున్న

(మొదటిపేజీ తరువాయి)



అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆత్మహత్యకు ముందు రాసిన లేఖ కంటతడి పెట్టిస్తోంది.
'సారీ అమ్మా.. నా కోసం చాలా కష్టపడ్డావు. కానీ నీ కలను నెరవేర్చలేకపోతున్నా.. బతకాలని ఉన్నా ఈ బాధను భరించలేకపోతున్నా.. బతకడం కష్టంగా అనిపిస్తోంది.. ఈ బాధ మోయడం నావల్ల కావడం లేదు. నీ కోసం ఏమీ చేయలేకపోతున్నా డాడీ. మీ కోసం చాలా కష్టపడదాం అనుకున్నాను. మీరు కలలుగన్న జీవితం మీకిద్దాం అనుకున్నాను. కానీ నేను అనుకున్నది చేయలేకపోతున్నాను. నేను చనిపోయాక నాపై కోప్పడకండి. నన్ను ఎప్పుడూ లవ్ చేస్తూనే ఉండండి. అన్నయ్య, వదిన, అమ్మ, అమ్మమ్మా.. మీరు ఇప్పటికైనా కలవండి. ద్వేషించుకోకండి' అంటూ బాలిక ఆవేదనను వ్యక్తం చేస్తూ లేఖ రాసింది. కుటుంబంలో వివాదాల కారణంగా శివాని ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కుటుంబంలో కలహాలు ఆమెను ఎంతో బాధపెట్టాయో ఈ లేఖ ద్వారా అర్థమవుతుంది. నాలుగు రోజుల క్రితం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న బాలిక ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకోవడం కుటుంబసభ్యుల్ని కలిచివేసింది.
శివాని మరణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఆమె ఆత్మహత్య చేసుకోవడం ఆవేదన కలిగిచిందన్నారు. 'పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆ రోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవ్వడం నన్ను కలిచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవ్వరూ ఒత్తిడికి, నిరాశ, నిస్పృహలకులోను కావొద్దని కోరుతున్నాను. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధను, ఆవేదనను మీ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని, అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని తెలియజేస్తున్నాము' అంటూ ట్వీట్ చేశారు.
శివాని రంపచోడవరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 24న పోలవరం జిల్లా రంపచోడవరంలో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో శివాని తన ప్రసంగంతో అందరిని ఆకట్టుకున్నారు. వచ్చే ఏడాది షైనింగ్ స్టార్ అవార్డు తీసుకుంటానని సీఎంకు ధీమాతో చెప్పారు.. చంద్రబాబు ఆమెను పిలిచి పక్కన కూర్చొపెట్టుకొని ప్రశంసించారు. అయితే ఇవాళ ఆమె ఆత్మహత్య చేసుకోవడం విషాదాన్ని నింపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో అంత ధైర్యంగా మాట్లాడిన బాలిక ఆత్యహత్య చేసుకోవడం ఏంటనే చర్చ జరుగుతోంది.

## నాణ్యమైన బియ్యం కిలో రూ.52కే లభ్యం

అమరావతి, జులై 27, అనంతజనశక్తి న్యూస్

కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యుడికి సాంత్వన చేకూర్చేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52లకు, గ్రేడ్ 1 రా రైస్ రూ.50లకు రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. సామాన్యుడిపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ప్రత్యేకంగా చొరవ తీసుకోవడం స్వాగతించదగినదని చెప్పారు.
'బహిరంగ మార్కెట్ ధరలను సమీక్ష చేసి, మిల్లర్లతో అత్యవసరంగా సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండేలా మేలైన ధరలను నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థికభారాన్ని తగ్గిస్తుంది.' అని పవన్ కళ్యాణ్ విశ్వాసం వ్యక్తంచేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో భవిష్యత్తులో చేపట్టనున్న సంస్కరణలు, కార్యాచరణకు కేంద్ర సహకారం కోరుతూ ఢిల్లీలో రెండు రోజుల పర్యటనకు వెళ్లారు మంత్రి నాదెండ్ల మనోహర్. ఇందులో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అనీస్ జోసెఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దేందుకు చేపట్టనున్న సంస్కరణలు, పరస్పర సహకారం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.




## డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "డీఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు నేను సిద్ధం. ఈ చర్చ కేవలం డీఎస్సీకే పరిమితం కాదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన లిక్కర్, భూ కుంభకోణాలపై కూడా చర్చిద్దాం" అని సవాల్ విసిరారు. 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీది అయితే, ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయని నీచ చరిత్ర జగన్‌ది అని లోకేశ్ ధ్వజమెత్తారు. "వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు. మేము 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే, దాన్ని అడ్డుకోవాలని 150 కేసులు వేశారు. ఆ కేసులన్నీ కోర్టులు కొట్టివేయడమే మా చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఆయన స్పష్టం చేశారు.
తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అభివృద్ధి, సంక్షేమం అయితే.. గొడ్డలి పార్టీ విధానం విధ్వంసం, బూతులు, బాబాయ్‌ను గొడ్డలితో లేపేయడం, తల్లి, చెల్లిని ఇంటి నుంచి తరిమేయడం అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' (సీసీడీ) అనే జబ్బు ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీసుకొచ్చిన ఆర్సెలర్ మిట్టల్, గూగుల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను తానే తెచ్చానని జగన్ చెప్పుకోవడం ఆయనకున్న జబ్బు లక్షణమని అన్నారు.
ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్ల బండిలా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ విజయాలను, వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాలు గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.



# కేంద్రం హామీలను నిలబెట్టుకోవట్లేదు



**- సీజేపీ ఆరోపణలు**

కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించుకుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు.

ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళనకారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించుకోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

బిహార్‌లో విద్యార్థులపై ఏకే47 తుపాకులు: రాహుల్ గాంధీ

బిహార్‌లో విద్యార్థులు నిరసన చేస్తున్న సమయంలో పోలీసులు వారిపైకి ఏకే47 తుపాకులతో కాల్పులు జరిపారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దిల్లీలోనూ విద్యార్థులపై పెల్లెట్‌గన్‌లు వాడారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మాట నిలుపుకోదని.. విద్యార్థుల గొంతులను అణచివేసేందుకే వారు తప్పుడు హామీలు ఇచ్చారని విమర్శించారు. కాగా.. జులై 25న 'బిహార్ బంద్' సందర్భంగా జరిగిన ఆందోళనల సమయంలో సివాన్ జిల్లాలో ఓ పోలీసు కానిస్టేబుల్ నిరసనకారులపై ఏకే47 ఎక్కుపెట్టిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో ఇది వివాదాస్పదమైంది. ఈ క్రమంలోనే సదరు కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

# లోక్‌సభ ముందుకు.. యాంటీ పేపర్ లీక్ బిల్లు





పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించే దిశగా కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది ఈ చట్టాన్ని సవరించేందుకు ఇటీవల ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు.

ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది. ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు ఇప్పటివరకు 35 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 510 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ప్రస్తుత సవరణలకు ఆమోదం లభిస్తే.. భాగంగా దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

# కెనడాలో భారత యువతి హత్య



కెనడాలో పంజాబ్‌కు చెందిన యువతి దారుణ హత్యకు గురైంది. టొరంటో నగరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నవ్‌నీత్ కౌర్ (26) బులేవార్డ్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఓ వ్యక్తి ఆమెను వెంబడించాడు. కొద్దిసేపు ఆమెతో మాట్లాడిన అనంతరం ఒక్కసారిగా తుపాకీతో కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ప్రత్యక్ష సాక్షి తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరి మధ్య ఎలాంటి వాగ్వాదం జరగకుండానే నిందితుడు కాల్పులకు పాల్పడ్డాడు.

ఈ కేసులో 37 ఏళ్ల శరణ్‌జీత్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిది కూడా పంజాబేనని గుర్తించారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. డ్రోన్లు, ఇతర సాంకేతిక పరికరాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఇది టార్గెటెడ్‌గా చేసిన హత్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అయితే హత్య వెనుక అసలు ఉద్దేశం ఏంటనేది తెలియాల్సి ఉందన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనకు కొద్ది రోజుల ముందే కెనడాలోని ఎడ్మంటన్‌లో భారత్‌కు చెందిన మరో యువతి హత్యకు గురైన సంగతి తెలిసిందే. 23 ఏళ్ల దమన్‌ప్రీత్ కౌర్‌ను రితేష్ కుమార్ (22) గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

## భారత నావికుడి మృతి.. ఉక్రెయిన్ దౌత్యవేత్తకు కేంద్రం సమన్లు



: ఒకవైపు హర్మూజ్ జలసంధిలో భారత నావికుల ప్రాణాలు ప్రమాదంలో ఉండగా.. మరోవైపు నల్ల సముద్రంలో రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలతో అదే పరిస్థితి ఎదురవుతోంది. నల్లసముద్రంలో ఒక వాణిజ్యనౌకపై జరిగిన దాడిలో భారత నావికుడు సాగర్ గుప్తా ప్రాణాలు కోల్పోయారు. జులై 18న మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉన్నI నౌక రష్యా జలాల్లో ప్రయాణిస్తుండగా ఈ దాడి జరిగింది. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన కేంద్ర ప్రభుత్వం ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్‌కు సమన్లు జారీచేసింది . వాణిజ్య నౌకలపై దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, సముద్ర వాణిజ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలని ఘర్షణలో భాగమైన దేశాలకు హితవు పలికింది. సాగర్ గుప్తా నౌకలో చీఫ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నల్ల సముద్రంలో రష్యాకు సమీపంలో ఉండగా ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడిలో అతడు చనిపోయినట్లు ఎఫ్ఎస్‌యూఐ తెలిపింది. దాడి జరిగినప్పుడు ఆ నౌకలో 10 మంది సిబ్బంది ఉన్నారని.. వారిలో ముగ్గురు భారతీయులని పేర్కొంది.

# ఈ20 ఇంధనం విషయంలో పోస్టులు.. హైకోర్టును ఆశ్రయించిన గడ్కరీ



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ20 పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ధి పొందుతోందంటూ పలువురు నెటిజన్లు ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు, పోస్టులు పెడుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన పరువుకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు చేసేవారిపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఇటువంటి కంటెంట్‌ను వ్యాప్తి చేసేందుకు సహకరించిన మెటా, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై సివిల్ దావా వేసేందుకు కోర్టు ఆయనకు అనుమతి ఇచ్చింది.

E20 ఇంధన కార్యక్రమానికి సంబంధించి కేంద్రమంత్రిపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేశారన్న ఆరోపణలపై నలుగురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై నాగ్‌పుర్‌లో ఎఫ్ఐఆర్ నమోదైన దాదాపు రెండు వారాల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. వీరిలో ప్రముఖ యూట్యూబర్‌రాజకీయవేత్త మనీష్ కశ్యప్, ఇన్‌ఫ్లుయెన్సర్లు హర్షిత్ రాఠీ, అంక్లేష్ ఇన్వతీ ఉన్నారు. 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకాన్ని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రోత్సహిస్తున్నారు. దాని వల్ల వాహనాల ఇంధన సామర్థ్యం తగ్గుతుందంటూ వస్తున్న ఆరోపణలను పలుమార్లు ఆయన కొట్టిపారేశారు. దేశం ఏటా ఇంధన దిగుమతుల కోసం రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఇథనాల్ తయారు చేయాలనే నిర్ణయంతో రైతులకు దాదాపు రూ.45వేల కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. పెట్రోల్ ఉత్పత్తుల్లో 20శాతం ఇథనాల్ వాడకంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తోసిపుచ్చారు. ఇథనాల్ బ్లెండింగ్‌పై జరుగుతోన్న ప్రచారం కేవలం పెయిడ్ క్యాంపెయిన్ అని.. అందులో ఎటువంటి వాస్తవం లేదని తెలిపారు.

# ఆస్పత్రి నుంచి సోనమ్ వాంగ్‌చుక్ డిశ్చార్జి



పర్యావరణ ఉద్యమకారుడు వాంగ్‌చుక్ (గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అక్కడి నుంచి ఆయన నేరుగా రాజ్‌ఘాట్‌కు వెళ్లి.. మహాత్మాగాంధీ సమాధి వద్ద నివాళులర్పించనున్నారు. ఆ తర్వాత లద్దాఖ్ బయల్దేరి వెళ్లనున్నారు. ఈ మేరకు వాంగ్‌చుక్ 'ఎక్స్'లో ఓ వీడియోను పోస్టు చేశారు. ఇన్నాళ్లూ తనకు వైద్య సేవలు అందించిన వైద్యులు, అక్కడి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జూన్ 28న జంతర్‌మంతర్ వద్ద ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. ఆరోగ్యం క్షీణిస్తుండటంతో దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు జులై 18న ఆయన్ను సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. అయితే, వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమించే ప్రమాదం ఉందని.. ప్రైవేటు ఆస్పత్రికి తరలించేందుకు అనుమతివ్వాలని దిల్లీ హైకోర్టులో ఆయన భార్య గీతాంజలి పిటిషన్ దాఖలు చేయగా న్యాయస్థానం అంగీకరించింది. దీంతో జులై 22న ఆయన్ను మేదాంత ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. పేపర్ లీకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇవ్వడంతో నిరాహార దీక్షను విరమించారు. కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో ఈ నెల 23 అర్ధరాత్రి దాటిన తర్వాత దీక్షను ముగించారు.

## పీవోకేపై అయితేనే పాక్‌తో చర్చలు



**- స్పష్టం చేసిన రాజ్‌నాథ్ సింగ్**

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) గురించి తప్ప మరే అంశంపైనా పాకిస్థాన్‌తో మన దేశం చర్చలు జరపబోదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని ఆ దేశం జాతీయ విధానంగా మార్చుకుందంటూ విమర్శించారు. పాక్ ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా.. దాని ఊహకు కూడా అందనంత రీతిలో దెబ్బకొడతామని హెచ్చరించారు. 27వ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని కార్గిల్ యుద్ధ స్మారకంవద్ద రాజ్‌నాథ్ ఆదివారం నివాళులర్పించి ప్రసంగించారు. ఉగ్రవాదంతో భారత్‌ను భయపెట్టాలని చూసేవారి గతి ఏమవుతుందో ఆపరేషన్ సిందూర్ స్పష్టంగా చాటి చెప్పిందని పేర్కొన్నారు.

కార్గిల్ యుద్ధ వీరులకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో అత్యంత కఠిన పరిస్థితుల్లోనూ మన సైనికులు చూపిన తెగువ దేశానికి ఎప్పుడూ గర్వకారణమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## భర్తను మోస్తూ.. 180కి.మీ. యాత్ర



వ్యాధిగ్రస్థుడైన భర్తను తలపై మోసిన సతీ సుమతి కథను పురాణాల్లో చదివాం. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఆశా అనే మహిళ దివ్యాంగుడైన భర్తను 180 కి.మీ. భుజాలపై మోస్తూ కావడి యాత్రను పూర్తి చేసింది. హరిద్వార్‌లో కావడి యాత్ర ఇంకా ప్రారంభం కాకముందే చాలా మంది యాత్రికులు అక్కడికి చేరుకున్నారు. గాజియాబాద్ జిల్లా మోదీనగర్‌కు చెందిన ఆశా తన భర్త సచిన్‌తో కలిసి హరిద్వార్‌కు వెళ్లింది. కొన్నాళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో సచిన్ గాయపడి పూర్తిగా నడవలేని స్థితికి చేరుకున్నాడు. భర్త కోరిక మేరకు కావడి యాత్ర తలపెట్టిన ఆశా అతడిని భుజాలపై మోస్తూ ఈ యాత్రను పూర్తి చేసింది.

## దేశాభివృద్ధిలో భాగమవుతా



భారతీయ పౌరురాలిగా తానెంతో గర్విస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఏపీలోని చిత్తూరు జిల్లా తవణంపల్లెకు చెందిన భవ్యశ్రీ అన్నారు. 'వికసిత్ వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రాం'లో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యువతతో వర్చువల్‌గా మాట్లాడారు. బీటెక్ పూర్తిచేసిన భవ్యశ్రీ ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. ఆమె హైదరాబాద్‌లోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'మై భారత్ పోర్టల్‌లో నిర్వహించే క్విజ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. ఉత్తరాఖండ్‌లో పర్యటించాను. అక్కడి భౌగోళిక పరిస్థితులు తెలుసుకున్నా. ప్రజలు ఐకమత్యంతో ఉంటే దేశం అభివృద్ధి సాధిస్తుంది. దేశాభివృద్ధిలో పాలుపంచుకుంటాను' అని తెలిపారు.

## తల్లిని చంపిన హంతకుడిని పట్టించిన ఐదేళ్ల బాలుడు



తన తల్లిని హత్య చేసిన తండ్రిని ఐదేళ్ల బాలుడు పోలీసులకు పట్టించిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్ (UP)లోని మహోబా జిల్లాలో వెలుగు చూసింది. బిజ్రారీ గ్రామానికి చెందిన హనీఫ్ అనే వ్యక్తి పోలీసులకు ఫోన్ చేసి.. తన భార్య తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు చెప్పాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతురాలిపై పదునైన ఆయుధంతో దాడి చేసి, హత్య చేసినట్లు గుర్తించారు. విచారణ సమయంలో పొంతన లేని సమాధానాలు చెప్పడంతో హనీఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వారి ఐదేళ్ల కుమారుడితో పోలీసులు మాట్లాడగా.. తన తండ్రే కొడవలితో తల్లిపై దాడి చేశాడని చెప్పాడు. చిన్నారి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా విచారణ జరపగా.. నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. శనివారం రాత్రి హనీఫ్ మద్యం మత్తులో ఇంటికి వచ్చి.. తన భార్య మనీషా (27)తో గొడవపడ్డాడు. ఈ క్రమంలోనే నిందితుడు విచక్షణ కోల్పోయి కొడవలితో ఆమెపై దాడి చేశాడనిపోలీసులు వెల్లడించారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతురాలు ఎనిమిది నెలల గర్భిణి అని.. కడుపులోని బిడ్డ కూడా ప్రాణాలు కోల్పోయిందని తెలిపారు. దాడి జరిగిన సమయంలో వారి కుమారుడు, రెండేళ్ల కుమార్తె అక్కడే ఉన్నారు. తల్లి హత్యను చూసినప్పటి నుంచి ఆ పిల్లాడు తీవ్ర భయాందోళనకు గురవడంతో అతడిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.



# భద్రతకు స్నేహబంధాలు!

**డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తరవాత చేపట్టిన విధానాలు అమెరికా విశ్వసనీయతపై అనుమానాలూ ఆందోళనలను రేకెత్తించాయి. దాంతో అమెరికా మిత్రదేశాలన్నీ ఆర్థిక, రక్షణ, వ్యూహాత్మక రంగాల్లో అగ్రరాజ్యంపై ఆధారపడటం తగ్గిస్తున్నాయి. తమలోతాము సహకరించుకుంటున్నాయి. ప్రపంచంలో వస్తున్న ఈ మార్పుల మధ్య భారత్ కూడా ప్రాంతీయంగానూ, కొంత దూరంలోని దేశాలతోనూ సంబంధాలను బలోపేతం చేసుకుంటోంది. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో పట్టు పెంచుకోవడానికీ అడుగులు వేస్తోంది.**

**ఒక దేశాధినేత మరో దేశాధినేత విదేశీ పర్యటనపై స్పందించడం, అదికూడా ఎంతో సానుకూల వ్యాఖ్యలు చేయడం మామూలు విషయం కాదు. ఇక్కడ ప్రస్తావిస్తున్నది భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటనపై దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ చేసిన ప్రకటన గురించి. ఈ పర్యటన 'భారత్, న్యూజిలాండ్‌ల మధ్య మైత్రిని పరిపుష్ఠం చేసి, రెండు దేశాల ప్రగతికి ఊపునిస్తుంద'ని ఆకాంక్షిస్తున్నట్లు జే మ్యూంగ్ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ఇండోనేసియా, ఆస్ట్రేలియాలతో పాటు న్యూజిలాండ్‌నూ సందర్శించిన మోదీ- తన విదేశ యాత్రపై 'మిత్రుడి' ట్వీట్‌ను ప్రశంసించారు. ఆ సంగతిని అలా ఉంచితే- చైనా, అమెరికా కలిసి 'గ్రూప్ ఆఫ్ టూ'గా ఏర్పడతాయనే అంచనాలున్నాయి. అమెరికా చపలచిత్త విధానాలు, చైనా దూకుడు నేపథ్యంలో ఇండో-పసిఫిక్ ప్రాంత (ఐవోఆర్) దేశాలు తమ బంధాలను మరింత బలోపేతం చేసుకుంటున్నాయి.**

**ఉమ్మడి ప్రయోజనాలకు ఒప్పందాలు**

**అమెరికా తన నౌకాదళ విభాగమైన ఇండో-పసిఫిక్ కమాండ్ పేరును తిరిగి యూఎస్ పసిఫిక్ కమాండ్‌గా మార్చింది. మిత్రులు, ప్రత్యర్థులనే తేడా లేకుండా అన్ని దేశాలపై సుంకాలు పెంచేస్తూ ఒత్తిడిని కొనసాగిస్తోంది. నిలకడ లేని వాణిజ్య విధానాలను అనుసరిస్తోంది. ఇవన్నీ కలిసి ఇండో-పసిఫిక్ దేశాలను కలవరపరుస్తున్నాయి. దీనికితోడు ఇటీవల దక్షిణ పసిఫిక్‌లో చైనా చేపట్టిన సుదూర బాలిస్టిక్ క్షిపణి పరీక్ష మరింత ఆందోళనకరంగా మారింది. ఈ వాతావరణంలో ఐవోఆర్‌లో నమ్మకమైన భాగస్వాములను పెంచుకోవడానికి భారత్ నడుంబిగించింది. ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటనను ఈ కోణం నుంచే అర్థం చేసుకోవాలి.**

**మోదీ పర్యటన సందర్భంగా బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణి, అస్త్ర గగనతల క్షిపణులను కొనుగోలు చేయడానికి ఇండోనేసియా ముందుకొచ్చింది. అలాగే, ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరా ఒప్పందంపై సంతకాలు జరిగాయి. న్యూజిలాండ్‌తో కుదుర్చుకున్న సముద్ర, రక్షణ ఒప్పందాలు నైరుతి పసిఫిక్ మహాసముద్రంలో భారత్ ఉనికిని పెంచుకోవడానికి తోడ్పడతాయి. ఈ మూడు దేశాలను సందర్శించడానికి ముందే, ప్రధాని మోదీ జూన్ నెలలో సీషెల్స్‌లో పర్యటించారు. జులై ప్రారంభంలో జపాన్ ప్రధాని సనాయే తకాయిచి భారత్‌కు వచ్చారు. ఆ సమయంలో రెండు దేశాలు ఆర్థిక భాగస్వామ్య పెంపునకూ, సైనిక పరికరాల సంయుక్త అభివృద్ధికీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. భారత్ ఇలా ద్వైపాక్షిక ఒప్పందాలే కాకుండా త్రైపాక్షిక ఒప్పందాలనూ కుదుర్చుకుంటోంది. కృత్రిమ మేధ, హరిత ఇంధనం, అరుదైన లోహాల సరఫరా గొలుసులు, డిజిటల్ మౌలిక సదుపాయాల్లో సహకార వృద్ధికి కెనడా, ఆస్ట్రేలియా, ఇండియా ఇటీవల ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఆస్ట్రేలియా, దక్షిణ కొరియాలు 2029 నాటికి గ్రీన్ షిప్పింగ్ కారిడార్‌ను ఏర్పాటు చేయబోతున్నాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని వర్ధమాన, మధ్యశ్రేణి దేశాలు తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనపెట్టి మరీ సహకార వృద్ధికి ముందుకొస్తున్నాయి. సంఘర్షణల వల్ల అనిశ్చితి పెరుగుతున్న ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థలో ఈ బంధాలు ఎంతవరకు సాయపడతాయో చూడాలి.**

**భారత్‌కు అత్యవసరం**

**ఐవోఆర్ భద్రతా వ్యవస్థలో ఇంతవరకు కీలక పాత్ర పోషించిన అమెరికా, తన ప్రమేయాన్ని పెంచుకుంటుందా లేక వెనక్కి తగ్గుతుందా అనే విషయంలో స్పష్టత లేదు. ఇండో-పసిఫిక్ కమాండ్ పేరు మార్పు నిర్ణయాన్ని పసిఫిక్‌పై అమెరికా మరింత దృష్టి సారిస్తోందనడానికి సంకేతంగా భావిస్తున్నవారూ ఉన్నారు. అమెరికా పశ్చిమ తీరం నుంచి భారతదేశ పశ్చిమ సరిహద్దు వరకు విస్తరించిన స్వేచ్ఛాయుత మండలాన్ని కాపాడటానికి తాము ఇప్పటికీ నిబద్ధులై ఉన్నామని వాషింగ్టన్ స్పష్టం చేస్తోంది. కానీ, అమెరికా తన ప్రయోజనాలను కాపాడుకోవడానికే ఐవోఆర్‌లో ఉంటుంది తప్ప ఇతరులకోసం కాదని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా భారత్, అమెరికా సంబంధాలు ఇటీవల కాలంలో ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. భారత్- చైనాతో సంబంధాలు ఎగుడుదిగుడులకు లోనవుతున్నాయి. పాక్‌తో ఘర్షణ వాతావరణం పెరుగుతోంది. మరోవైపు అమెరికా సుంకాలు పెద్ద సమస్యగా మారాయి. ట్రంప్ విధానాలు, ఇరాన్ యుద్ధం కారణంగా భౌగోళిక-ఆర్థిక-రాజకీయ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమయంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని దేశాలతో ఇండియా తన సంబంధాలను పటిష్ఠపరచుకోవడం చాలా అవసరం.**

# 'సర్'.. ఏ అసమర్థతలకు చిహ్నం?

**మనం జ్ఞానం పొందటంలో ప్రత్యక్ష అనుభవానికి మించింది మరొకటి ఉండదు. అన్ని విషయాల్లో ఇది సాధ్యం కాకపోయినా రాజకీయాల్లో ప్రత్యక్ష అనుభవానికి ఉన్న పాత్ర చాలా ఎక్కువ. ఓటర్ల జాబితాను సమూలంగా ప్రక్షాళించటానికి ఉద్దేశించిన (సర్) ప్రక్రియ జరుగుతున్న తీరుతెన్నులను చూస్తుంటే ప్రజల ప్రత్యక్ష అనుభవం చెబుతున్న పాఠాలు చాలా కఠోరంగా ఉంటున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఇంకో రెండేళ్ల తర్వాతే జరుగుతాయి. బిహార్, బెంగాల్, తమిళనాడులో లాగా ఎన్నికల ముందు హడావుడిగా ఇక్కడ సర్ చేపట్టలేదు. అంతవరకూ కాస్త ఉపశమనమే. కానీ తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్న దాన్ని, ఓటర్లలో నెలకొన్న అనేక సందేహాలను, వాళ్లు స్వయంగా సేకరించాల్సిన సమాచారాన్ని, వెలికితీయాల్సిన పత్రాలను దృష్టిలో పెట్టుకుంటే.. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆ మూడు రాష్ట్రాల్లో ఏం జరిగిందో, దానికి మూల్యం ఎవరు చెల్లించారో అర్థంచేసుకోవటం కష్టం కాదు.**



సర్ నిబంధనల ప్రకారం బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలి. ఇది ప్రాథమిక నియమం. నగరాలు, పట్టణాల్లో అది అమలవుతున్న ప్రాంతాలను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెబుతోంది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు కనపడుతున్నాయి. ఇది అంతవరకే అయిపోలేదు. పూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ ప్రక్రియలో ప్రాథమిక అడుగే సరిగా పడలేదని దీన్నిబట్టి తేలికగానే అర్థం అవుతుంది. అయినా మన యంత్రాంగం సమర్థత బ్రహ్మాండంగా ఉందని మనం సరిపెట్టుకోవాలి. అంతా సజావుగా నడుస్తోందని మనకుమనమే సర్దిచెప్పుకోవాలి. నియమాలు ఘనంగా, అమలు హీనంగా ఉండటం అనేది మన ప్రభుత్వాల సహజ లక్షణంగా భావిస్తేనే అలా చేయగలం. ముఖ్యంగా అట్టడుగు, మధ్యతరగతి వర్గాలకు వచ్చేసరికి ఎన్నో చట్టాలు, నియమాల పరిస్థితి ఇదే తీరులో ఉంటోంది. అందుకే ఏ ప్రక్షాళనలోనైనా నష్టపోయేది ఈ వర్గాలే.

కొత్తగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదుచేయటానికి ఎన్నో పత్రాలు చూడాలి. స్వయంగా బీఎల్ఓ ఆ వ్యక్తి నివసించే ఇంటిని సందర్శించాలి. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదనేది నియమం. ఆ నియమాన్ని కచ్చితంగా పాటించే.. ఓటర్లుగా నమోదుచేశామని చెప్పే ఎలక్షన్ కమిషన్ తాను జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డులనే సర్‌లో ప్రామాణికంగా తీసుకోలేమని సుప్రీంకోర్టుకు స్వయంగా చెప్పింది. అలాగే ఆధార్ కార్డూ అందుకు ఉపయోగపడదని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టూ చివరకు ఎలక్షన్ కమిషన్ వాదననే పరిగణనలోకి తీసుకుంది. ఆధార్ కార్డుని విదేశీవ్యక్తులకు కూడా జారీచేస్తారని, అందుకే అది ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో మన ఇంగితజ్ఞానం చెబుతూనే ఉంటుంది. ఎంతమంది విదేశీయులకు అధికారికంగా ఆధార్ కార్డులు జారీ అయివుంటాయో లెక్కలుతీస్తే వారి సంఖ్య చాలా పరిమితంగానే ఉంటుంది. వాళ్లు అయినా కొన్ని పత్రాలు సమర్పించకుండా కార్డులు పొందలేరు. అతి స్వల్పసంఖ్యలో విదేశీయులు ఆధార్ పొందుతుంటే మొత్తం ఆధార్ కార్డుల ప్రామాణికతనే శంకించటం సామాన్యుల తర్కానికి అందదు. పర్యాటకులుగానో, విద్యార్థులుగానో, ఉద్యోగులుగానో, పరిశోధకులుగానో వచ్చిన విదేశీ వ్యక్తులకు ఆధార్ ఇవ్వాలన్న నిబంధనను అధికారికంగానే పెట్టుకుని ఈ వాదనను చేయటం విడ్డూరంగానూ, వైపరీత్యంగానూ భావించాలి. ఇక ఇతర దేశాల సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వాళ్లు ఆధార్ కార్డులు పొందటం ఎక్కువగానే ఉందని అనుకుందాం. మరి అందుకు కారణం ఎవరు? అని ప్రశ్నించుకుంటే వేళ్లన్నీ అధికారయంత్రాంగం వైపే చూపుతాయి. పోనీ వీళ్లు అయినా కేంద్ర మంత్రులు ప్రచారం చేస్తున్నట్లు కోట్లలో ఉన్నారా? సరిహద్దు రాష్ట్రాలన్నీ అక్రమ వలసదారులతో నిండిపోతున్నాయా? అని పరిశీలిస్తే అలాంటి భయానక దృశ్యం కనపడదు. అసాంలో 2025-26లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను (స్పెషల్ రివిజన్) చేపట్టారు. ఆ సందర్భంగా తొలగించిన ఓట్లు 2,43,485 మాత్రమే. వీళ్లల్లో చనిపోయిన వారితో పాటు రెండుచోట్ల ఓట్లున్న వారి పేర్లూ ఉన్నాయి. పోనీ ఇందులో సందేహాస్పద ఓటర్లు ఎంతమందో అధికారికంగా ప్రకటించనూలేదు. అలా ప్రకటిస్తే కనీసం అక్రమవలసదారుల గురించి ఒక అవగాహన ఏర్పరచుకునే అవకాశం ఉండేది.

సందేహాస్పద ఓటర్లందరినీ మనం అక్రమ వలసదారులుగా భావించలేం. బీఎల్ఓలకు సరైన పత్రాలను అందించలేని వాళ్లనూ ఆ జాబితాలో చేర్చుతారు. ఇంకో విషయాన్ని చూసినా అక్కడి అసలు పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. 1997 నుంచి 2023 వరకూ అసాంలో మొత్తం 2,44,144 మందిని అనుమానాస్పద ఓటర్లుగా భావించి వారి పౌరసత్వాన్ని తేల్చటానికి ఫారెన్ ట్రైబ్యునళ్లకు నివేదించారు. వీళ్లందరూ అక్రమవలసదారులే అనుకున్నా మొత్తం ఓటర్లలో వారు ఒకశాతం మాత్రమే ఉంటారు. కానీ వీళ్లల్లో 51,505 మందిని మాత్రమే విదేశీయులుగా తేల్చారు. మరికొందరిని భారతీయులుగానే పరిగణించారు. కొన్ని కేసులు ఇంకా ట్రైబ్యునళ్లలో నడుస్తున్నాయి. రాజకీయ లబ్ధికోసం చేసే ఆర్భాటప్రకటనలకూ వాస్తవాలకూ మధ్య దూరం మామూలుగా ఉండదని దీన్నిబట్టి స్పష్టం అవుతోంది.

తెలంగాణలో 2002లో చేపట్టిన సర్ తర్వాత ఏడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటువేసిన వారందరూ కూడా ఇప్పుడు మళ్లీ తమని తామే నిఖార్సైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఇంటర్‌నెట్‌ని ఉపయోగించగలిగినవాళ్లు కూడా 2002 నాటి సర్ జాబితాలో తమ పేర్లు వెతుక్కోటానికి కిందామీదా పడుతున్నారు. గంటలపాటు దానికోసం ప్రయత్నించి విఫలమై చివరకు 2002నాటి సర్‌లో తమపేరు లేదనే వెసులుబాటును ఉపయోగించుకుని ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూర్తిచేస్తున్నారు. దీనికి ఫోన్‌నంబరు, ఆధార్ కార్డు వివరాలను సమర్పించి వాటి ఆధారంగా వచ్చే ఓటీపీలతో (వన్‌టైం పాస్‌వర్డ్స్) ప్రక్రియను పూర్తిచేస్తున్నారు. 2002 నాటి సర్ జాబితాతో సంబంధం లేకుండానే ఓటర్లుగా కొనసాగే అవకాశం ఉంటే అసలు దాంతో మొత్తం ప్రక్రియను ఎందుకు ముడిపెట్టాల్సి వచ్చిందనే ప్రశ్న తలెత్తకమానదు. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. 2002 నాటి సర్ ఎంతచక్కగా జరిగిందో తెలుసుకోవాలంటే అప్పటి పత్రికల కథనాలు చూస్తేగానీ విషయం అర్థంకాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడు సర్‌కు సంబంధించి ప్రత్యేక హడావుడి కనపడలేదు. మామూలు ఓటర్ల జాబితా సవరణ లాగే అది జరిగిపోయింది. బహుశా అప్పుడు ఎన్నికలు లేకపోవటం కూడా అందుకు కారణమై ఉంటుంది. దీనికి భిన్నంగా ఇటీవల బిహార్, బెంగాల్, తమిళనాడుల్లో తగిన సమయం ఓటర్లకు ఇవ్వకుండా హడావుడిగా సర్ చేపట్టటంతోనే తీవ్రస్థాయిలో వివాదాలు చెలరేగాయి. రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల వ్యూహాలు, ఎత్తుగడలు, ప్రచారాల్లో మునిగిపోయిన సందర్భంలో సర్ చేపట్టటం అనుచితంగానే కనపడుతుంది. ఆ అనుచిత చర్యలే ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను ప్రశ్నించేలా ఆస్కారం కల్పించాయి. అధికార వ్యవస్థలన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం కావాల్సిన రీతిలో ఒరిగిపోతున్న నేపథ్యంలో ఎన్నికల ముందు చేపట్టిన సర్‌పై అనుమానాలు కలగకుండా ఉండవు. ఇప్పుడే బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లలేని పరిస్థితి ఉంటే 2002లో సర్ అంతా సక్రమమని భావించి దాన్ని ప్రామాణికంగా తీసుకోవటం ఏ మాత్రం సహేతుకంగా అనిపించదు. అప్పటికి మొబైల్ ఫోన్లు లేవు. ల్యాండ్‌లైను ఫోను ఉన్న వాళ్లూ తక్కువే. సోషల్ మీడియా లేదు. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే ఇప్పటి స్థాయిలో విస్తృత ప్రజానిఘా లేని ఆనాటి పరిస్థితిలో 2002 నాటి సర్‌కు చాలా పరిమితులు ఉంటాయి. పేర్లలో, ఇంటి పేర్లలో, వయస్సుల నమోదులో ఎన్నో తప్పులు ఆనాటి జాబితాలో కనపడతాయి. వీటన్నిటినీ సరిదిద్దుకోవాల్సిన బాధ్యతను ఇప్పుడు ఓటర్లపైనే పెట్టారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదుచేయటం రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ విధి. అలా నమోదుచేసిన వాళ్లను కొన్నేళ్ల తర్వాత 'మిమ్మల్ని మీరు ఓటర్లుగా నిరూపించుకోండి' అని చివరికి అదే కమిషన్ ఆదేశించటం ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని పలుచన చేయటమేనని ఇప్పటికే ఎన్నో విమర్శలు వచ్చాయి.

గ్రామాల్లో చనిపోయిన వారి సమాచారం స్థానిక పంచాయతీ సిబ్బంది దగ్గర ఉంటుంది. కనీసం దాని ఆధారంగా ప్రతిఏటా జరిగే ఓటర్ల సవరణ ప్రక్రియలో వాళ్ల పేర్లను తేలికగానే తొలగించవచ్చు. అది కూడా చేయలేని అసమర్థతను ఎన్నికల కమిషన్ యంత్రాంగం ప్రదర్శించింది. ఇటీవల సర్ చేపట్టిన రాష్ట్రాల్లో ఒక్క బెంగాల్ మినహా మిగతా చోట్ల ఎంతమంది చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారో స్పష్టంగా పేర్కొనలేదు. బెంగాల్‌లో 91 లక్షల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. అందులో మరణించిన వారి పేర్లు 58.08 లక్షలు ఉన్నాయి. ఏటా ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా జరిగితే ఒక్కసారిగా ఇన్నిపేర్లను తొలగించాల్సిన అవసరం ఉండదు. అన్ని రాష్ట్రాల్లో సర్ పూర్తయితే ఎంతమంది ఓటర్ల జాబితా నుంచి తొలగిపోతారన్నది ఇంకా స్పష్టం కాలేదు. మొత్తంగా ఈ సంఖ్య 10 కోట్లు దాటుతుందనే అంచనాలు ఉన్నాయి. సర్ పూర్తయిన చోట ఇప్పటివరకూ 5 కోట్లకు పైబడి పేర్లను జాబితాల నుంచి తొలగించారు. తుది లెక్కలు తేలేసరికి దాదాపుగా 10శాతానికి పైగా ఓటర్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉంది. ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ ఇంతస్థాయిలో ఇలా తొలగింపులు జరగలేదన్న విమర్శను తేలికగా కొట్టేయలేం. చనిపోయిన వాళ్లను, ఒకటికి మించి పలుచోట్ల ఓటర్లుగా ఉన్న వాళ్లను జాబితా నుంచి తొలగించటానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే వెసులుబాట్లను కనుక్కోకుండా మీరు పౌరులో కాదో నిరూపించుకోండని అందరినీ కోరటం నిర్హేతుకంగానే ఉంటుంది.

ఎన్నికలు ముంగిట్లోలేని రాష్ట్రాల్లో సర్ తొలగింపులతో నష్టం తక్కువగానే ఉండొచ్చు. తక్షణ రాజకీయ అవసరాలు ఉన్నచోట పరిస్థితి వేరుగా ఉంటుందన్నదానికి బిహార్, బెంగాల్ ఎన్నికలప్పుడు చెలరేగిన వివాదాలే నిదర్శనం. సర్‌తో ఓట్లు తొలగిన తర్వాతా మళ్లీ జాబితాలో కొత్త ఓటరుగా నమోదు కావటానికి అవకాశం ఉంటుందని అధికారులు ఒకటికి పదిసార్లు చెప్పారు. నిబంధనలు అందుకు అనుకూలంగా ఉన్నాయనీ స్పష్టంచేశారు. కానీ, రోజులు గడవకుండానే మెలికపెట్టారు. దీనినీ సర్‌తో ముడిపెట్టారు. మొత్తంగా 'సర్'తో ఎన్నికల కమిషన్ నిష్పక్షపాత పాత్రపై నమ్మకం పలచబడిపోయింది. మళ్లీ దాన్ని బలోపేతం చేసుకుంటేనే ఎన్నికల కమిషన్ పాత్రకు సార్థకత చేకూరుతుంది. భవిష్యత్తులో ఇదే తరహా సర్‌లు పునరావృతమైతే కమిషన్ సమర్థతపైనే సందేహాలు అలుముకుంటాయి. పాస్‌పోర్టు కూడా భారత పౌరసత్వానికి చిహ్నం కాదన్న విచిత్రవాదనతో అంతర్జాతీయంగా పరువుపోయింది. సర్ పేరుతో ఇంత జరిగిన తర్వాత కూడా భవిష్యత్తులో ఓటరు కార్డులకు ప్రామాణికత ఉండదనే వాదనను మళ్లీ చేస్తే ఎన్నికల కమిషన్ తన ప్రతిష్ఠను నిలబెట్టుకోవటం కష్టం! ఓటరు కార్డులున్న వారందరినీ పౌరులుగా భావించలేమన్న వాదనను ఎల్లకాలం కొనసాగించితే అది మన ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చ!

# నేరగ్రస్త రాజకీయాల ప్రక్షాళనకు

**తెలిసి తెలిసి దొంగ చేతికి తాళాలు ఇచ్చాక- డబ్బూదస్కం, నగానట్రా అన్నీ పోయాయని ఎంత ఏడిస్తే ఏం లాభం? అలాగే, చూస్తూ చూస్తూ నేరచరితులైన నేతలకు పదవులు అప్పగించి, ఆ తరవాత వాళ్లంతా కలిసి దోచుకుతింటున్నారని, ప్రజాప్రయోజనాలకు పాతరేస్తున్నారని ఎన్ని విమర్శలు చేస్తే మాత్రం ఏంటి ప్రయోజనం? చట్టాలను ఉల్లంఘించేవారు చట్టసభల్లోకి అడుగుపెట్టనేకూడదని సుప్రీంకోర్టు ఇరవై ఏళ్ల క్రితమే ఉద్ఘాటించింది. నేరచరిత్ర కలిగిన నాయకులు ఎన్నికల ప్రక్రియను కలుషితం చేస్తారని ఆందోళన వ్యక్తంచేసింది. కానీ, ఎలాగైనా ఎలక్షన్లలో గెలవాలనుకునే రాజకీయ పార్టీల పుణ్యమా అని భారత ప్రజాస్వామ్యం నేడు నేరగ్రస్త రాజకీయాల విషకౌగిలిలో చిక్కుకుపోయింది. ఏడీఆర్ నివేదికల ప్రకారం, 2009 లోక్‌సభ ఎన్నికల్లో నేరారోపణలను నెత్తినమోస్తున్న 162 మంది ఎంపీలయ్యారు. 2024కు వచ్చేసరికి అటువంటి వారు 251కి పెరిగారు. కిందటి నెల నాటికి 226 మంది రాజ్యసభ సిట్టింగ్ ఎంపీల్లో 31శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 28 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 4092 మంది ఎమ్మెల్యేల్లో 45శాతం మందికి నేరచరిత్ర ఉన్నట్లు ఏడీఆర్ నిరుటి అధ్యయనాంశాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది కేరళ అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన వారిలో 84శాతం మంది రకరకాల కేసుల్లో నిందితులైతే- పశ్చిమబెంగాల్ నూతన ఎమ్మెల్యేల్లో 65శాతం, తమిళనాడు శాసనసభ్యుల్లో 54శాతం మందిదీ అదే బాపతు నేపథ్యం! విచారణల్లో సుదీర్ఘ జాప్యం, శిక్షలు అరుదుగా పడుతుండటం వల్ల అభియోగాలు రుజువైన వారిపైనే అనర్హత వేటువేసే విధానం నేరమయ రాజకీయాల ప్రక్షాళనకు పనికిరావట్లేదన్నది లా కమిషన్ సైతం తేల్చిచెప్పిన చేదునిజం!**

ప్రధానమంత్రి నుంచి రాష్ట్రాల మంత్రుల వరకు ఎవరైనా తీవ్ర నేరాభియోగాలపై అరెస్టు అయ్యి, వరుసగా 30రోజులకు మించి నిర్బంధంలో ఉన్నపక్షంలో వారిని పదవుల్లోంచి తప్పించాలని కేంద్రం నిరుడు ప్రతిపాదించింది. ఆ రాజ్యాంగ సవరణ బిల్లును పరిశీలించిన పార్లమెంటరీ కమిటీ ఎల్లుండి తన నివేదికను సమర్పించబోతున్నట్లుగా తెలుస్తోంది. నిర్దేశిత కాలం జైల్లో ఉన్న వ్యక్తులను మంత్రి పదవుల్లోంచి తొలగించడమే తప్ప వారి చట్టసభ సభ్యత్వాలను రద్దు చేయడానికి ఉద్దేశించిన బిల్లు కాదు కాబట్టి దీనివల్ల ప్రభుత్వాల మనుగడకు ఎలాంటి ముప్పు ఉండదని అధికారవర్గాలు చెబుతున్నాయి. కానీ, కేవలం పోలీసు రిపోర్టులను ఆధారం చేసుకునే అనర్హతను వర్తింపజేయలేమని లా కమిషన్ 2014లోనే స్పష్టీకరించింది. అయిదేళ్లకు మించి శిక్షపడే కేసుల్లో నేరాభియోగాల నమోదు దశలో సునిశిత న్యాయసమీక్ష అనంతరం సంబంధిత నేతలను అనర్హులుగా ప్రకటించవచ్చని కమిషన్ అప్పట్లో సూచించింది. దీన్ని ఎవరూ దుర్వినియోగం చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలనూ లా కమిషన్ తన నివేదికలో క్రోడీకరించింది. సహేతుకమైన ఆ సిఫార్సులను అమలుచేస్తేనే క్రిమినల్ నాయకుల కబంధ హస్తాల్లోంచి జనభారతానికి నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది!

కిందటేడాది జనవరి ఒకటో తేదీనాటికి దేశవ్యాప్తంగా ప్రజాప్రతినిధులపై 4732 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ, 20132025 మధ్యలో నేరాలు రుజువై సిట్టింగ్ ఎంపీలూ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడిన సందర్భాలు 27గానే లెక్కతేలుతున్నాయి. జాతి వనరులను స్వాహాచేసిన తీవ్ర ఆర్థిక నేరాలకు సంబంధించిన 11 సీబీఐ కేసులు, 9 ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న వై.ఎస్.జగన్ దాదాపుగా 13 ఏళ్లుగా బెయిల్‌పై స్వేచ్ఛా జీవితం గడుపుతున్నారు. నేర రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనాలుగా పరువుమాసిన ఇటువంటివారు అధికార పీఠాలను అధిష్ఠించి జనాన్ని కాల్చుకు తినకూడదంటే ప్రజాప్రతినిధులపై నమోదైన కేసులను వేగంగా విచారించాలి. నేరగాళ్లుగా తేలిన తాలునేతలను ప్రజాజీవితంలోంచి శాశ్వతంగా వెలేయాలి!

# బ్రిటిష్ విపణిలో జెండా పాతాలంటే..

**నేటి నుంచి అమలులోకి వస్తున్న భారత్-బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా) మన ఎగుమతిదారులకు కొత్త అవకాశాలను కల్పిస్తోంది. వివిధ రంగాల్లో వివిధ రకాలుగా ఉండే వీటిని అందిపుచ్చుకోవడానికి సమగ్ర వ్యూహం పాటించాలి. కార్మికులను పెద్ద సంఖ్యలో నియమించి తయారుచేసే వస్తువులు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, సముద్ర ఆహారం, ఆటోమొబైల్స్, కొన్ని పారిశ్రామిక ఉత్పత్తులను బ్రిటన్‌కు పెద్దఎత్తున ఎగుమతి చేయడానికి 'సెటా' వీలు కల్పిస్తుంది.**

నిరుడు బ్రిటన్ 92,890 కోట్ల డాలర్ల విలువైన వస్తువులను దిగుమతి చేసుకుంది. వాటిలో భారత్ నుంచి వెళ్లిన వస్తువుల విలువ కేవలం 1,520 కోట్ల డాలర్లే. ఈ వాటాను పెంచుకోవడానికి 'సెటా' సాయపడుతుంది. ఈ ఒప్పందం కింద బ్రిటన్‌లో బాగా గిరాకీ ఉన్న కొన్ని రంగాల్లో భారత ఎగుమతుల వృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయి. భారతదేశం 2025లో ప్రపంచ దేశాలకు 1,630 కోట్ల డాలర్ల విలువైన దుస్తులను ఎగుమతి చేసింది. అదే సంవత్సరం బ్రిటన్ మిగతా దేశాల నుంచి దిగుమతి చేసుకున్న దుస్తుల విలువ 2,130 కోట్ల డాలర్లు. వాటిలో భారతదేశం నుంచి వెళ్లిన వస్త్రాల విలువ 130 కోట్ల డాలర్లు మాత్రమే. 'సెటా' వల్ల భారతీయ దుస్తుల దిగుమతులపై సుంకాలు తగ్గుతాయి కాబట్టి, ఈ అవకాశాన్ని మన పరిశ్రమలు ఉపయోగించుకోవాలి. 'సెటా' కింద సుంకాలు తగ్గే తోలు వస్తువులు, పాదరక్షల ఎగుమతి వృద్ధికీ బాగా అవకాశాలున్నాయి.

కొన్నింట్లో అధికం... మరికొన్నింట్లో మధ్యస్థం!

గడచిన సంవత్సరంలో బ్రిటన్ దిగుమతి చేసుకున్న ప్రాసెస్ చేసిన ఆహారం విలువ 3,340 కోట్ల డాలర్లు కాగా, అందులో భారత్ వాటా 35.4 కోట్ల డాలర్లే. బ్రిటన్‌కు రెడీ టూ ఈట్ ఆహారాలు, బేకరీ, మిఠాయి ఉత్పత్తులు, సాస్‌లు, భారతీయ వంటకాల ఎగుమతులను పెంచడానికి గొప్ప అవకాశాలున్నాయి. 2025లో భారత్ ప్రపంచదేశాలకు 2,560 కోట్ల డాలర్ల విలువైన ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేసింది. సరిగ్గా ఇదే కాలంలో బ్రిటన్ 2,320 కోట్ల డాలర్ల విలువైన దిగుమతులు చేసుకుంది. అందులో భారత్ వాటా కేవలం 3.1 శాతం. 'సెటా' చలవతో దీన్ని బాగా పెంచవచ్చు. నిరుడు భారత్ అన్ని దేశాలకు ఎగుమతి చేసిన చేపలు, మాంసం, ప్రాసెస్డ్ మాంసాహారాల విలువ 1280 కోట్ల డాలర్లు. అదే సంవత్సరం బ్రిటన్ 1720 కోట్ల డాలర్ల విలువైన మాంసాహారాన్ని విదేశాల నుంచి తెప్పించుకుంది. ఆ దిగుమతుల్లో భారత్ నుంచి వచ్చినవాటి విలువ 12.6 కోట్ల డాలర్లు మాత్రమే. బ్రిటన్ ఆహార ప్రమాణాలను పాటించి మన ఎగుమతులను పెంచుకోవచ్చు. ఆటోమొబైల్స్, మోటార్‌సైకిళ్లు, వాటి విడిభాగాలనూ పెద్ద సంఖ్యలో బ్రిటన్‌కు పంపవచ్చు. బ్రిటన్ దిగుమతి చేసుకున్న ఈ తరహా వస్తువుల విలువ 9,220 కోట్ల డాలర్లు కాగా, వాటిలో భారత్ ఎగుమతుల విలువ 32.5 కోట్ల డాలర్లే. 'సెటా' కింద సుంకాల తగ్గింపుతో ఈ రంగంలోనూ భారతీయ ఎగుమతిదారులకు చక్కటి అవకాశాలు లభిస్తాయి. యంత్రాలు, టెలికాం, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతుల పెంపునకూ 'సెటా' ఊతమిస్తుంది. ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యమిస్తూ తిరుగులేని నాణ్యతా ప్రమాణాలను పాటిస్తేనే ఎగుమతుల్లో భారత్‌కు లబ్ధి కలుగుతుంది.

రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్ రంగంలో భారత్‌కు బలమైన సరఫరా సామర్థ్యం ఉన్నప్పటికీ, 'సెటా' ద్వారా లభించే అవకాశాలు పరిమితం. బ్రిటన్ ప్లాస్టిక్, రబ్బరు ఉత్పత్తుల దిగుమతుల్లో భారత్ వాటా స్వల్పమే. సుంకాల తగ్గింపు కొన్ని వస్తువుల ఎగుమతికి తోడ్పడినా పర్యావరణ నిబంధనలు, సాంకేతిక ప్రమాణాలు, బలమైన పోటీ వల్ల లాభాలు తక్కువగా ఉంటాయి. 2025లో బ్రిటన్ ప్రపంచ దేశాల నుంచి 17,850 కోట్ల విలువైన వజ్రాలు, బంగారం, వెండి ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. వీటిలో భారత్ నుంచి వంద కోట్ల డాలర్ల విలువైనవి మాత్రమే దిగుమతి అయ్యాయి. లండన్ అంతర్జాతీయ బులియన్ మార్కెట్ కాబట్టి, ఇక్కడ నెగ్గుకురావడం భారత్‌కు సులువు కాదు. కాగితం, కొయ్య ఉత్పత్తులు, రైల్వేవిమాననౌకా ఉత్పత్తులు, కృత్రిమ పూలు, గొడుగులు, వంట నూనెలు కూడా మధ్యస్థ అవకాశాల విభాగంలోకి వస్తాయి. రవాణా ఖర్చులు, పర్యావరణ నిబంధనలు, తీవ్రమైన పోటీ, విదేశాలకు పంపేందుకు భారత్‌కు మిగులు పరిమితంగా ఉండటం తదితరాల వల్ల ఈ వస్తు ఎగుమతుల్లో లాభాలు తక్కువగా ఉంటాయి.

మెరుగ్గా సిద్ధం కావాలి!

ఇనుము, ఉక్కు ఉత్పత్తులకు సంబంధించి బ్రిటన్ విధించే కఠిన నిబంధనలు, తగ్గిన కోటాలు, అధిక సుంకాలు 'సెటా'కు అడ్డురావచ్చు. మద్యం, పొగాకు ఉత్పత్తుల ఎగుమతులకూ అవకాశాలు తక్కువే. మద్యం విషయంలో బలమైన పోటీ, సిగరెట్లు వంటి వాటిలో అధిక ఎక్సైజ్ పన్నులు, కఠినమైన ఆరోగ్య నిబంధనలు ఇందుకు కారణాలు. భారత్‌కు కొన్ని వస్తువులలో బలమైన ఎగుమతి సామర్థ్యం ఉంటేబ్రిటన్‌లో వాటికి గణనీయమైన గిరాకీ నెలకొంది. 'సెటా'తో సుంకాల ప్రతికూలతలు తప్పిపోతాయి కాబట్టి దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దుస్తులు, తోలు, పాదరక్షలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, సముద్ర ఆహారం, ఎంపిక చేసిన వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో ఇది స్పష్టంగా లాభిస్తుంది. ఆటోమొబైల్స్ దీర్ఘకాలికంగా మంచి అవకాశాన్ని అందిస్తాయి. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాబ్రికేటెడ్ మెటల్ ఉత్పత్తులు కూడా బలంగా వృద్ధి చెందగలవు. కానీ, ఈ రంగాల్లో విజయం సుంకాల తగ్గింపు కంటే నాణ్యతా ప్రమాణాల పైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల భారత్‌కు రంగాలవారీగా ఎగుమతి వ్యూహం అవసరం. ఆహార ఎగుమతిదారులు బ్రిటిష్ శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలను పాటించడం తప్పనిసరి. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ సంస్థలకు ధ్రువీకరణ, నవీన సాంకేతికత, బలమైన కొనుగోలుదారుల సంబంధాలు కావాలి. ఆటోమొబైల్ ఎగుమతిదారులు వస్తూత్పత్తి ప్రదేశాన్ని నిర్ధారించే నిబంధనలను పాటించాలి.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# క్రియేటివ్ ఎకానమీకి ఏపీ కేరాఫ్ అడ్రస్

- సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- రాజమహేంద్రవరంలో మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ఘనంగా ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లోగో, పోస్టర్ ఆవిష్కరణ
- 'వన్ ఇండియా - వన్ సినిమా' దిశగా ఎఫ్‌టీపీసీ అడుగులు అభినందనీయమని పేర్కొన్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం జూలై 27, అనంత జనశక్తి న్యూస్

సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఏపీలో క్రియేటివ్ ఎకానమీని అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నట్లు తద్వారా రాష్ట్రాన్ని వినోద రంగానికి సరికొత్త గమ్యస్థానంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్ టీపీసీఏ) ప్రతినిధులు సోమవారం రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీపీసీ జాతీయ కార్యకలాపాలకు సంబంధించిన అధికారిక పోస్టర్, లోగోలను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎఫ్‌టీపీసీఏ ప్రతినిధులు తమ భవిష్యత్ ప్రణాళికలను మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం లాంటి సాంస్కృతిక వేదికపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు."ఒకప్పుడు తెలుగు, తమిళం, హిందీ అని వేర్వేరు ప్రాంతీయ చిత్రాలుగా చూసేవాళ్లం. కానీ నేడు పాన్ ఇండియా విప్లవం, ఓటీటీల రాకతో సినిమా స్వరూపమే మారిపోయింది. ప్రేక్షకులకు భాషతో సంబంధం లేకుండా అన్ని రకాల వినోదం అందుతోంది. సినిమాకి ఏ భాషా సరిహద్దు కాదని నిరూపితమైంది" అన్నారు.ఈ నేపథ్యంలో "దేశమంతా ఒకే వినోద వేదికపైకి రావాలనే ఎఫ్‌టీపీసీ ఆశయం అభినందనీయం. ఈ 'వన్ ఇండియా వన్ సినిమా' అనే విప్లవాత్మక లక్ష్యం ప్రతి ఒక్కరికీ చేరాలి. థియేటర్, టెలివిజన్, ఓటీటీ... ఈ మూడు రంగాలు సమాంతరంగా వృద్ధి చెందడమే ప్రభుత్వ ఆకాంక్ష." అన్నారు."రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. భవిష్యత్తులో ఎఫ్‌టీపీసీ చేపట్టే అన్ని రకాల ప్రమోషనల్ కార్యక్రమాలకు, సినీ అభివృద్ధి చర్యలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి సహకారం ఉంటుంది." అని హామీ ఇచ్చారు. క్రియేటివ్ ఎకానమీ ప్రతినిధులు త్వరలోనే రాజధాని అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ కార్యకలాపాలను విస్తృతంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భారతదేశంలో సినీ సాంకేతిక, వినోద రంగాన్ని ఒకే గొడుగు కిందికి తెచ్చేందుకు ఎఫ్‌టీపీసీ చేస్తున్న కృషిని మంత్రి దుర్గేష్ కొనియాడారు.మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన వారిలో ఎఫ్‌టీపీసీ ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగా, సెక్రటరీ వర్మ పాకలపాటి, సఖి శక్తి వెల్ఫేర్ ఫౌండేషన్ (పాన్ ఇండియా) ప్రెసిడెంట్ జయ పటేరియా, శ్రీనివాస్, రమేష్, ఈశ్వర్ తదితర ప్రతినిధులు ఉన్నారు.




# సుబ్రహ్మణ్యేశ్వరా కరుణించు తండ్రి.. రైతులపై దయ చూపండి



- పంపనూరులో వరుణ హోమం.. సహస్ర ఘటాభిషేకం
- హోమం, పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత
- పవిత్రజలాలతో స్వామి వారికి అభిషేకం
- వర్షా లు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

ఎమ్మెల్యే సునీత ఆకాంక్ష

ఆత్మకూరు జూలై 27, అనంత జనశక్తి న్యూస్

అనంతపురం జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో, శాస్త్రోక్తంగా వరుణయాగం నిర్వహించారు. గత కొన్ని రోజులుగా ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పంపనూరు క్షేత్రంలో "వరుణహోమం" "సహస్ర ఘటాభిషేకం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాలయం నుంచి పవిత్ర జలాలను తీసుకొని గ్రామ బొడ్డు రాయి దగ్గరికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం బొడ్డు రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, శ్రీ పరమేశ్వరునికి, శ్రీ పార్వతి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య సహస్ర ఘటాభిషేకం చేశారు. ఆలయంలో వెయ్యి కలశాలతో అభిషేకం చేశారు. పవిత్ర నదీ జలాలు, మంత్రాలతో అభిమంత్రించిన నీటిని వెయ్యి కలశాలలో నింపి.. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకం చేశారు. ఆ తర్వాత లోక కల్యాణం కోసం, వర్షాలు బాగా కురవాలని, దేశం సుభిక్షంగా ఉండాలని వరుణ హోమం నిర్వహించారు. వర్షాలు బాగా కురవాలని, నీటి కటకటలు తొలగిపోవాలని హోమం చేశారు. వేద మంత్రాలు పఠిస్తూ అగ్నిలో నెయ్యి, ధాన్యం, ఇతర ద్రవ్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు బాగా కురవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడం వలన రైతులు ఆందోళనలు చెందుతున్నారన్నారు. రిజర్వాయర్లలో కూడా నీరు అనుకున్నంత మేర రావడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అత్యంత పవిత్రమైన పంపనూరులో వరుణయాగం, సహస్ర ఘటాభిషేకం కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కృప వలన వర్షాలు బాగా కురవాలని.. పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.



# హెపటైటిస్‌పై పోరులో టీకాలే ప్రధాన ఆయుధం

- ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం – డా. దినేష్

అనంతపురం, జూలై 28:అనంత జనశక్తి న్యూస్



కాలేయాన్ని తీవ్రంగా దెబ్బతీసే హెపటైటిస్ వ్యాధిని నివారించడంలో టీకాలు అత్యంత ప్రభావవంతమైన మార్గమని కిమ్స్ సవీర ఆసుపత్రి కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. దినేష్ పేర్కొన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, హెపటైటిస్ అనేది కాలేయంలో వాపును కలిగించే వ్యాధి అని, ఇది ప్రధానంగా వైరస్‌ల వల్ల సంక్రమిస్తుందని తెలిపారు. హెపటైటిస్-ఏ, బి, సి, డి, ఈ అనే ఐదు ప్రధాన రకాల వ్యాధులు ఉన్నాయని వివరించారు.హెపటైటిస్-బి నివారణకు టీకా అత్యంత సమర్థవంతమైనదని, హెపటైటిస్-సికి ప్రస్తుతం టీకా లేకపోయినా సమర్థవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కలుషిత ఆహారం, నీరు, రక్తం, శరీర ద్రవాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున పరిశుభ్రత, సురక్షిత వైద్య విధానాలు, సురక్షిత రక్త మార్పిడి వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.భారతదేశంలో కోట్లాది మంది హెపటైటిస్-బి, సి వైరస్‌లతో బాధపడుతున్నారని, అందువల్ల ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స, టీకాలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా వైరల్ హెపటైటిస్‌ను సమర్థవంతంగా నియంత్రించవచ్చన్నారు.2030 నాటికి వైరల్ హెపటైటిస్‌ను ప్రజారోగ్య సమస్యగా నిర్మూలించాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని డా. దినేష్ పిలుపునిచ్చారు."అవగాహన, పరీక్షలు, టీకాలు" అనే మూడు అంశాలను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి



- అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

పుట్టపర్తి,జూలై,27:అనంత జనశక్తి న్యూస్

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 332 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డీఆర్ఓ కొండయ్య,ఎస్‌డిసి విజయ కుమారి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

అనంతపురం, జులై 27 :అనంత జనశక్తి న్యూస్



అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, రమేష్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, కిరణ్మయి, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 697 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. అందులో రెవెన్యూ క్లినిక్ కు సంబంధించి 302 అర్జీలు రావడం జరిగింది. ఇందులో అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులకు అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను నాణ్యతగా పరిష్కరించడం ముఖ్యమైనదని, జిల్లా అధికారులు ప్రతిరోజు అర్జీలపై దృష్టి పెట్టి ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎన్నిటిని పరిష్కరించారు, మిగిలిన అర్జీల పరిష్కారంపై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని ఆదేశించారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. పెండింగ్ లో ఉన్న అర్జీలను కూడా వేగవంతంగా పరిష్కరించాలని, ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పరిష్కరించడం చేయాలని ఆదేశించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి సత్వరమే పరిష్కారం చూపించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం చూపించరాదన్నారు.అన్ని శాఖల జిల్లా అధికారులు పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, వ్యతిరేకతను తగ్గించాలని, ఆయా మండలాల్లో వెనుకబడిన వాటిని తనిఖీ చేయాలని ఆదేశించారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పై ముందుగానే మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, సర్వే ఏడి, పిసిబి, తదితర శాఖల పరిధిలో అందరు లబ్ధిదారులతో మాట్లాడాలని, పాజిటివిటీ వీటిని మరింత మెరుగుపరచాలన్నారు. ఎఫ్ లైన్ పిటిషన్లను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డిటిసి వీర్రాజు, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, డ్వామా పిడి సలీమ్ భాష, జడ్పి సిఈఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిసిఓ అరుణకుమారి, హౌసింగ్ పిడి శైలజ, డిపిఓ నాగరాజునాయుడు, డిఆర్డీఏ పిడి శైలజ, డిప్యూటీ డిఈఓ శ్రీనివాసరావు, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూకౌతారి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస్ యాదవ్, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి అర్చన, సెక్షన్ సూపరింటెండెంట్లు వసంతలత, యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతి గృహాలకు కే ఎస్ హెచ్ కంపెనీ సాయం

- కలెక్టర్ చేతుల మీదుగా టీవీలు పంపిణీ

పుట్టపర్తి జూలై 27:అనంత జనశక్తి న్యూస్

సోమవారం రేవెన్యు భవన్ నందు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్‌లో భాగంగా కే ఎస్ హెచ్ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్ (పెనుగొండ) సంస్థ జిల్లాలోని 25 కళాశాల వసతి గృహాలకు లైబ్రరీ ర్యాక్స్, 20 టీవీలను సమకూర్చింది.ఇందులో భాగంగా సోమవారం ఉదయం ధర్మవరం, పెనుగొండ డివిజన్లలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పరిధిలోని 10 వసతి గృహాలకు 43 ఇంచుల స్మార్ట్ టీవీలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సంబంధిత అధికారులకు అందజేశారు. విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధికి సహాయం అందించిన కె ఎస్ హెచ్ ఆటోమోటివ్ యాజమాన్యానికి ఈ సందర్భంగా కలెక్టర్ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమములో జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్,బిసి సంక్షేమం అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.




# దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం..

- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

అనంతపురం ,జూలై 27:అనంత జనశక్తి న్యూస్




నేటి యువతభాగస్వామ్యం మన దేశ అభివృద్ధిలో ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు.

సోమవారం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో భారత ప్రభుత్వం మరియు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం గౌరవ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు మై భారత్ కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వ శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరి ముఖ్యంగా విద్యా, సంక్షేమ, క్రీడా, ఎన్ఎస్ఎస్, జిల్లా ప్రజా పరిషత్, డిపిఓ, ఎస్ ఎస్ ఏ, ఆన్ సెట్ తదితర శాఖ అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మై భారత్ కార్యక్రమాలను గ్రామస్థాయి నుండి మొదలుకొని కళాశాలల వరకు విస్తృతంగా తీసుకెళ్లి యువతలో అవగాహన పెంపొందించాలని తెలిపారు. యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావడానికి మై భారత్ వేదికగా నిలుస్తోందని జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు విద్యాసంస్థలు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు.

2026 27 సంబంధించి జిల్లాలోమైభారత్ఆధ్వర్యంలో నిర్వహించ నున్న వార్షిక కార్యచరణ ప్రణాళిక యువ జన కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి ,స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ ,విపత్తు నిర్వహణ శిక్షణలో సామాజిక సేవ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ తదితర కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించి ఈ సందర్భంగా కార్యాచరణను జిల్లా కలెక్టర్ రూపొందించిపలుఆదేశాలుసూచనలు జారీ చేశారు. అనంతరం మైభారత్ ప్రచార సామాగ్రి పోస్టర్ల స్టిక్కర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలోజిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ , డిఆర్ఓ మాలోల యువజనఅధికారి ఐశయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్ , మల్లికార్జున రెడ్డి, పద్మావతి, కిరణ్మయి ,డి ఐ పి ఆర్ ఓ బాల కొండయ్య,మై భారత్ కోఆర్డినేటర్ బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బి సాటి జీవన్ కుమార్, జయ మారుతి, వాలంటీర్లుఅంబరీష్ ,సాయి కార్తీక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. జి.మమత, ఆన్ సెట్ మేనేజర్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
మంగళవారం | అనంతపురం
28.07.2026



# గోపురాజు పల్లెలో ఇంటింటికి తెలుగుదేశం...



**పుట్లూరు, జూన్ 27, అనంత జనశక్తి న్యూస్ ;**

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని సోమవారం నుండి ఆ పార్టీ నేతలు మండలంలోని గోపురాజుపల్లి గ్రామంలో నిర్వహించారు.టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్, పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత వంట గ్యాస్, విద్యార్థులకు అందించే తల్లికి వందనం వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ,
గత ప్రభుత్వంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించామన్నారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, శ్రీనివాసులు, ఐ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్, బాల రంగయ్య, చిన్నారెడ్డి, కులశేఖర్ రెడ్డి, రవి కుమార్ రెడ్డి, మాధవరెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఎస్పీ ని కలిసిన ధర్మవరం నూతన డీఎస్పీ.



**పుట్టపర్తి రూరల్ జూలై 27 అనంత జన శక్తి న్యూస్.**

ధర్మవరం సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి.వి. జగన్నాథ్ రాజు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ని, వారి ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.
బి.వి. జగన్నాథ్ రాజు మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి ధర్మవరం డీఎస్పీగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి వాటిని కట్టడి చేసేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతమైన పోలీసింగ్ అందించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాల పట్ల రాజీ లేకుండా వ్యవహరించాలని తెలియజేశారు.

# వికలాంగులు, వృద్ధులు, మహిళలకు తొలి ప్రాధాన్యం .



**- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్...**

**పుట్టపర్తి రూరల్ జూలై 27 అనంత జన శక్తి న్యూస్.**

ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలను తొలి ప్రాధాన్యంగా పరిగణించి వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,తెలిపారు.సోమవారం పుట్టపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం ) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 70, ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఎస్పీ , ప్రతి వినతిపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు విన్నవించెందుకు వచ్చిన వికలాంగుల వద్దకే జిల్లా ఎస్పీ వెళ్లి వారి ఫిర్యాదులను పరిశీలించి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వారికి భరోసా కల్పించారు. ప్రతి ఫిర్యాదును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఒకే సమస్యపై పునరావృత ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, అత్తింటి వేధింపులు, సైబర్ నేరాలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి.కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, డి టి ఆర్ బి , ఎయిర్పోర్ట్ సీ ఐ లు ,లక్ష్మీకాంత్ రెడ్డి, బొజ్జప్ప, పోలీసు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థి అదృశ్యం.

**-పదవ తరగతి విద్యార్థి కనిపించలేదు.**

**ధర్మవరం జులై 27, అనంత జనశక్తి న్యూస్:**



పట్టణంలోని జీవానంద పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న మేలంగి గిరీష్ జూలై నెల 27వ తేదీ సోమవారం ఉదయం 8 గంటల నుండి కనబడటం లేదని టూటౌన్ సిఐ జయ నాయక్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... పాఠశాలకు పొమ్మని తల్లిదండ్రులు మందలించగా, ఇంటిలో ఎవరికీ చెప్పకుండా లేత ఆకుపచ్చ రంగు నలుపు రంగు, ముదురు నీలం రంగు గల ప్యాంటు వేసుకుని ఇంటి నుండి వెళ్లిపోయాడని తెలిపారు. ఈ విద్యార్థి ఎవరికైనా ఆచూకీ తెలిసినవారు టూ టౌన్ పోలీస్ స్టేషన్కు తెలపాలని కోరారు. లేదా వెంటనే సెల్ నెంబర్ 6305800429 కు తెలియజెప్పాలని తెలిపారు.

# అనంతపురానికి ఎయిర్‌పోర్టు అవసరం.. పునఃసర్వేతో మార్గం చూపండి

- ఉద్యాన పంటల కార్గోకు అనంతలో ఎయిర్‌పోర్టు కీలకం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కోరిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపి అంబికా లక్ష్మి నారాయణ..

**న్యూఢిల్లీ, జూలై 27: అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలని కోరుతూ రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశమై కోరారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గతంలో అనంతపురం జిల్లాలోని కూడేరు పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో చుట్టుపక్కల కొండలు ఉండడం వల్ల రెండు వైపులా విమానాలు ల్యాండ్ అయ్యే అవకాశం లేదని ఏవియేషన్ అధికారులు నివేదిక ఇచ్చిన విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. అయితే విశాఖపట్నం పాత విమానాశ్రయంలో అమలు చేసినట్లుగా వన్‌సైడ్ ల్యాండింగ్ విధానంలో రన్‌వే ఏర్పాటు చేసిన తరహాలో కూడేరు ప్రాంతంలో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని మంత్రి పయ్యావుల



కేశవ్ కోరారు. మరోసారి సమగ్ర సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమానయానాన్ని మరింత విస్తరించేందుకు చేపట్టిన చర్యలను కూడా మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. రాబోయే పదేళ్లలో దేశవ్యాప్తంగా మరో 100 ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఉడాన్ పథకాన్ని అనంతపురానికి వర్తింపచేయాలని పయ్యావుల కోరారు.అనంతపురం జిల్లా దేశంలోనే ఉద్యాన పంటల సాగులో అగ్రగామి జిల్లాల్లో ఒకటని, పెద్దఎత్తున ఇక్కడి నుంచి వివిధ మార్కెట్లకు తరలుతున్నాయని మంత్రి పయ్యావుల కేశవ్ రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో హార్టికల్చర్ కార్గోకు విస్తృత అవకాశాలు ఏర్పడి, రైతులు తమ ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు వేగంగా ఎగుమతి చేసే అవకాశం లభిస్తుందని, తద్వారా మెరుగైన గిట్టుబాటు ధరలు లభించి రైతుల ఆదాయం పెరుగుతుందని వివరించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందని, ఈ దిశగా చేపడుతున్న కార్యక్రమాలకు అనంతపురంలో ఎయిర్‌పోర్టు కీలక మౌలిక వసతిగా నిలుస్తుందని పయ్యావుల తెలిపారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి సర్వే నిర్వహించి 30 రోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

# రెండేళ్ల పాలనపై ప్రజల హర్షా తిరేకాలు

- ఎమ్మెల్యే దగ్గుపాటికి తొలిరోజు అనూహ్య స్పందన
- ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే
- భారీ గజమాలతో స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు
- జిల్లా అధ్యక్షుడితో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- ప్రజల్లోకి వచ్చి మా పాలనకు వస్తున్న స్పందన చూడాలన్న దగ్గుపాటి

**అనంతపురం జూలై 27, అనంత జనశక్తి న్యూస్**



కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. అనంతపురం నగరంలోని పాతూరులోని కనకదాసు విగ్రహం వద్ద నుంచి ఈ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, కూటమి పార్టీల నాయకులలు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారీ గజమాలతో ఆయన్ని సత్కరించారు. అనంతరం ఆయన అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందాయి.. నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి మీ స్పందన ఏంటన్నది ఎమ్మెల్యే దగ్గుపాటి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్తూ ఆయన రెండేళ్లలో చేసిన కార్యక్రమాల గురించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. గొడ్డలి పార్టీ పాలనలో జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిపోతే ఏడాదిలోపే మళ్ళీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టినట్లు వివరించారు. రెండేళ్లలోనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. మొదటి ఐదు సంతకాల్లోనే మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్లు, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిల యాక్ట్ రద్దు, యువతకు నైపుణ్యాలు పెంచే కార్యక్రమం వంటి హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆటో డ్రైవర్లకు 15వేలు, అన్నదాత సుఖీభవ అమలు చేశారన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం ఇచ్చామని.. జగన్ రెడ్డి పుస్తకాలు, బెల్టులపై తన పేర్లు వేసుకుని తుగ్లక్ మామయ్యగా మారాడని విమర్శలు చేశారు. గతంలో హంద్రీనీవా ప్రాజెక్టును ఎన్టీఆర్ ప్రారంభిస్తే.. దానిని పూర్తి చేస్తున్నది ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 1800 క్యూసెక్కులు ఉన్న ప్రవాహాన్ని 3500కోట్లు ఖర్చు పెట్టి 100 రోజుల్లోనే 3800క్యూసెక్కుల పెంచారన్నారు. ఇటు తమిళనాడు బార్డర్ లో ఉన్న కుప్పానికి అటు కర్ణాటక బార్డర్ లో ఉన్న మడకశిర వరకు నీరు తీసుకెళ్తున్నారన్నారు. 350కోట్లతో రైతులకు డ్రిప్పు, స్ప్రింకర్లు ఇచ్చారన్నారు. ఈ రెండేళ్లలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలు ఏమంటున్నారో వైసీపీ నాయకులు వచ్చి తెలుసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, బిజెపి నాయకుడు అశోక్, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి, డివిజన్ ఇంచార్జ్ కుళ్ళాయిస్వామి, టిడిపి జిల్లా కమిటీ నాయకులు కొనంకి గంగారాం, కంతాదేవి, దబ్బర కుమారస్వామి నాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, బెస్త పవన్ కుమార్, పోతుల లక్ష్మీనరసింహులు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకె లక్ష్మీనరసింహ, టిడిపి నాయకులు పావురాల శేఖర్, సుంకన్న, సింగవరం రవి, తోండపునాటి రమేష్, నెట్టెం బాలకృష్ణ, రాయల్ మధు, చేపల హరి తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీపై ఆరోపణలు కాదు రుజువులు చూపించు

- జగన్ పై మంత్రి సవిత ఫైర్
- చర్చకు రమ్మంటే పారిపోతున్నాడని ఎద్దేవా
- కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్న వైసీపీ
- బీసీ గర్జన పేరుతో మరో డ్రామా
- జగన్ శవ రాజకీయాలపై ప్రజల్లో విసుగు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి వైసీపీకి గుణపాఠం ఖాయం : మంత్రి సవిత
- గిద్దలూరులో ఇంటింటికీ తెలుగుదేశం
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధినిపై వివరించిన మంత్రి
- కూటమి పాలనపై ప్రజల్లో వస్తున్న స్పందనపై మంత్రి సవిత హర్షం

**గిద్దలూరు/మార్కాపురం ,**
**జూలై 27 అనంత జనశక్తి న్యూస్**

మెగా డీఎస్సీపై ఆరోపణలు కాదు రుజువులు చూపించమంటే జగన్ ముఖం చాటేస్తున్నాడని, దమ్ముంటే చర్చకు రా అని సవాల్ చేస్తున్నా పారిపోతున్నాడని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. అయిదేళ్ల పాటు నిరుద్యోగులను మోసం చేసిన జగన్ కు మెగా డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కుల, మతాల మధ్య చిచ్చు పెడుతూ శవ రాజకీయాలు చేస్తున్న వైసీపీని స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే మున్సిపల్, జెడ్పీ ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. బీసీ గర్జన అంటూ మరో డ్రామాకు వైసీపీ తెరలేపిందని, జగన్ ను, ఆ పార్టీ నాయకులను ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టంచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తు.చ.తప్పకుండా అమలు చేస్తోందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడు గుర్రాల్లో పరుగులు పెట్టిస్తోందని అన్నారు. గిద్దలూరు మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు రాజానగర్ లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డితో కలిసి మంత్రి సవిత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంతో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అమరావతి రాజధాని, పోలవరం పనులు పూర్తి కావొస్తున్నాయన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు అందజేయాలన్నదే సీఎంచంద్రబాబు లక్ష్యమన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంపు, అన్న క్యాంటీన్లు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక, తల్లికి వందనం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం..ఇలా ఎన్నో పథకాలను కేవలం రెండేళ్ల కాలంలోనే అమలు చేశామన్నారు. త్వరలో నూతన పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. చేనేతలకు ఉచిత విద్యుత్ ఇప్పటికే అందిస్తున్నామని, వచ్చే నెల ఏడో తేదీ నుంచి నేతన్న సేవలో పథకం పేరుతో ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం ఇవ్వనున్నామని మంత్రి సవిత తెలిపారు.



### బీసీ గర్జన పేరుతో వైసీపీ డ్రామా

**అయిదేళ్ల వైసీపీ పాలనలో జగన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మంత్రి సవిత మండిపడ్డారు. అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించడమేకాకుండా, ఇదేంటని ప్రశ్నించి వారిని తీవ్ర వేధింపులకు గురిచేశారన్నారు. బీసీలపై తప్పుడు కేసులు పెట్టి వారిని అన్ని విధాలా భయభ్రాంతులకు గురిచేశారన్నారు. అవన్నీ మర్చిపోయి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు దండుకోడానికి వైసీపీ మరోసారి బీసీ జపం చేస్తోందన్నారు. బీసీ గర్జన అంటూ కొత్త డ్రామాకు తెరతీసిందన్నారు. బీసీలెవరూ జగన్ ను గాని, వైసీపీని గాని పట్టించుకోరన్నారు. జగన్ ఎన్ని నాటకాలు ఆడినా బీసీలు ఆయనను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కూటమి ప్రభుత్వానికి బీసీలు దన్నుగా ఉన్నారని మంత్రి సవిత తెలిపారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పనితీరుపై మంత్రి ప్రశంసలు కురిపించారు. నియోజక వర్గంలో అభివృద్ధికి రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు.**

**నిరుద్యోగులకు జగన్ మోసం**

అయిదేళ్లలో జగన్ ఒక్కసారి కూడా టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా, నిరుద్యోగులను మోసగించారని మంత్రి సవిత మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు తన మొదటి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ పై సంతకం చేసి, 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. మెగా డీఎస్సీని అడ్డుకోడానికి జగన్ కోర్టుల్లో ఎన్నో కేసులు వేశారన్నారు. ఆ అడ్డకుంలన్నీ అధిగమించి, మంత్రి నారా లోకేశ్ మెగా డీఎస్సీని ఎటువంటి అక్రమాలకు తావులేకుండా నిర్వహించారన్నారు. ఓర్వలేని తనంతో మెగా డీఎస్సీ నిర్వహపై జగన్ విషం కక్కుతున్నారన్నారు. ఎటువంటి అక్రమాలు జరగకపోయినా, అవినీతి జరిగిందంటూ జగన్ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరోపణలు కాదు...రుజువులు చూపించు... చర్చకు రా...అంటే చేతకాత, జగన్ ముఖం చాటేసి పారిపోతున్నాడని మండిపడ్డారు. మెగా డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు జగన్ కు లేదని మంత్రి సవిత ఆగ్రహం వక్తంచేశారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే గెలుపు**

కులాలు, మతాలు మధ్య చిచ్చు పెడుతూ, శవ రాజకీయాలకు పాల్పడే వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని మంత్రి సవిత తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి వైసీపీకి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోందన్నారు.
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి కూటమి అభ్యర్థులకే ప్రజలు పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా, సమన్వయం చేసుకుంటూ విజయానికి కృషి చేయాలని మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు.

### యోగ, క్షేమాలు తెలుసుకుంటూ... పథకాలు వివరిస్తూ...

**అనంతరం ఎమ్మెల్యే అశోక్ రెడ్డితో కలిసి మంత్రి సవిత గిద్దలూరు మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు రాజానగర్ లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆప్యాయంగాపలుకరిస్తూ, కుటుంబ యోగా, క్షేమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు గురించి వివరించారు. పెన్షన్లు, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అందాయా... ఉచిత గ్యాస్ సిలిండర్లు తీసుకున్నారా...ఫ్రీ బస్ సౌకర్యం వినియోగించుకున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని, రాజధాని అమరావతి, పోలవరం పనులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తం కావడంపై మంత్రి సవిత ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అబ్జర్వర్ దశరథ ఆచారి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.**

# కల్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వర్లీ కళాకృతుల ద్వారా వినూత్నంగా సంపూర్ణ రామాయణం ప్రదర్శన..



- తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు..
- విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

**అనంతపురం, జులై 27 :అనంత జనశక్తి న్యూస్**

గార్లదిన్నె మండలం కల్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వర్లీ కళాకృతుల ద్వారా (వర్లీ ఆర్ట్ పెయింటింగ్స్) "సంపూర్ణ రామాయణం"ను వినూత్నంగా ప్రదర్శించినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా అధికారికంగా గుర్తింపు పొందారు. ఈ విషమమై అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం డిప్యూటీ డి ఈఓ శ్రీనివాసరావుతో కలిసి గార్లదిన్నె మండలం కల్లూరు జడ్పీ హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు డా.వరలక్ష్మి, స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ను కలిశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ వర్లీ కళాకృతుల ద్వారా (వర్లీ ఆర్ట్ పెయింటింగ్స్) "సంపూర్ణ రామాయణం"ను వినూత్నంగా ప్రదర్శించినందుకుగాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా అధికారికంగా గుర్తింపు పొందడం పట్ల ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు డా.వరలక్ష్మి, ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు కుమార్తె, స్పెషల్ ఎడ్యుకేటర్ & సైకాలజిస్ట్ మరియు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ సాయి దీపిక సంకేపల్లి, విద్యార్థులను అభినందించారు. తక్కువ సమయంలో వర్లీ కళాకృతుల ద్వారా "సంపూర్ణ రామాయణం "ను అర్థం చేసుకుని వినూత్నంగా ప్రదర్శించడం గొప్ప విషయం అన్నారు.ఈ సందర్భంగా ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు డా.వరలక్ష్మి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య మరియు వృత్తి విద్యను విద్యార్థులకు పరిచయం చేసేందుకు మరియు నూతన జాతీయ విద్యా విధానం అమలు చేసేందుకు ఈ విధానం దోహదపడుతుందని తెలిపారు. "సంపూర్ణ రామాయణం"లోని 7 ఖండాలను 7 గురు విద్యార్థులు, 20 మార్కులకు ఉన్న పాఠ్యాంశాన్ని 20 కుండల మీద చిత్రీకరించి రికార్డు సాధించటం జరిగిందని తెలిపారు. తాను మరియు తన కుమార్తె సాయి దీపిక సంకేపల్లి "సంపూర్ణ రామాయణం"ను వినూత్నంగా ప్రదర్శించినందుకుగాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా అధికారికంగా గుర్తింపు పొందడం జరిగిందని తెలిపారు. తమ ద్వారా విద్యార్థులు కూడా వర్లీ కళాకృతుల ద్వారా "సంపూర్ణ రామాయణం"ను అర్థం చేసుకుని వినూత్నంగా ప్రదర్శించడంతో వారికి కూడా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి .విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, జడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు రక్షిత, సౌజన్య, సుప్రజ, హేమంత్, తరుణ్ తేజ, సురేఖ, 9వ తరగతి విద్యార్థిని శ్రీలేఖ, తదితరులు పాల్గొన్నారు.

# సి బి యస్ ఇ. క్లస్టర్ 7 ఖో ఖో పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థునుల ప్రభంజనం




**రాప్తాడు జులై 27 అనంత జనశక్తి న్యూస్**

, రాప్తాడు మండలం, గొల్లపల్లి సమీపం నందు ఉన్నటువంటి మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఈ నెల 23, 24, 25, 26, తేదీలలో కరీంనగర్ జిల్లాలో ఉన్నటువంటి ఆల్ ఫర్స్ స్కూల్ నందు జరిగినటువంటి సి.బి.యస్.ఇ క్లస్టర్ సెవెన్ ఖో ఖో గేమ్ నందు అండర్ - 17 విభాగంలో ఇంటర్ స్టేట్ లెవల్లో బాలికలు ప్రథమ స్థానంలో గెలుపొందడం జరిగింది. దాదాపు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 64 టీమ్‌లు పాల్గొనడం జరిగింది, ఇందులో మొదటి స్థానం సాధించిన మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులను పాఠశాల ఎం.డి కృష్ణ భరత్ , కరస్పాడెంట్ కృష్ణ సమీర , ప్రిన్సిపల్ ప్రతాప్ రెడ్డి అభినందించడం జరిగింది అదేవిధంగా ఖో ఖో కోచ్ అయినటువంటి వీరన్నను కూడా అభినందించడం జరిగింది ఇంటర్ స్టేట్ లెవల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులు, తేదీ 29 - 09 - 2026 నుండి 04 - 10 - 2026 వరకు చెన్నైలోని వేలమ్మల్ విద్యాలయంలో జరగబోయే నేషనల్ స్థాయిలో పాల్గొనడం జరుగుతుంది.

# కార్పొరేట్ కంటే ఎంజేపీ సీట్లకే డిమాండ్

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం
- రాష్ట్రంలో కొత్తగా 10 బీసీ గురుకులాల ఏర్పాటు
- ఉత్తరాంధ్రలో, రాయలసీమలో అయిదేసి చొప్పున ప్రారంభం
- 6 బాలికల గురుకుల పాఠశాలలను జూనియల్ కళాశాలలుగా అప్ గ్రేడ్ : మంత్రి సవిత
- గిద్దలూరు బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రారంభం

**గిద్దలూరు జులై 27 అనంత జనశక్తి న్యూస్**




బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. దీనిలో భాగంగా కొత్తగా పది బీసీ గురుకులాలను ప్రారంభించామని, ఆరు బాలిక గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాల సీట్లకు కార్పొరేట్ సీట్ల కంటే డిమాండ్ అధికంగా ఉందన్నారు. బీసీలు అధికంగా ఉన్న చోట గురుకులాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గిద్దలూరు పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీతతో కలిసి మంత్రి సవిత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యతోనే సమాజాభివృద్ధి అని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు అని అన్నారు. ముఖ్యంగా బీసీలు విద్యలో రాణిస్తే అన్ని రంగాల్లోనూ ముందంజ వేయగలరని ఆయన భావన అని అన్నారు. అందుకే, రాష్ట్ర వ్యాప్తంగా ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కొత్తగా పది బీసీ గురుకులాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో వెనుకబడిన ఉత్తరాంధ్రలో అయిదు, రాయలసీమలో మరో అయిదు గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగా గిద్దలూరులో ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో అన్ని మౌలిక సదుపాయలతో ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. రూ.50 కోట్లతో శాశ్వత భవన సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

**ఫలితాల్లో ఎంజేపీదే అగ్రస్థానం**

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాల్లో విద్య బోధిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. అందుకే, కార్పొరేట్ విద్య సంస్థల సీట్ల కంటే ఎంజేపీ గురుకుల సీట్లకు అధిక డిమాండ్ ఉందని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ఇన్వర్టర్లు, పరిశుద్ధమైన తాగునీటికి ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దోమలు చొరబడకుండా దోమలు తెరలు తరగతి గదులు, విశ్రాంతి గదులు కిటికీలకు, తలుపులకు అమర్చుతున్నామన్నారు. విద్యతో పాటు క్రీడలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ట్రాక్ షూట్లు, బూట్లు అందజేశామన్నారు. త్వరలో స్పోర్ట్స్ కిట్లు కూడా అందజేయనున్నామని తెలిపారు. ఈ ఏడాది మే నెలలో విడుదలైన టెన్త్, ఇంటర్ లో ఎంజేపీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి, అగ్రగామిగా నిలిచారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల షైనింగ్ స్టార్స్ పేరుతో కూడా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించిందని మంత్రి సవిత గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలు అందిపుచ్చుకుని, అత్యుత్తమంగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, గురుకుల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా పాలనకు సంపూర్ణ మద్దతు లభిస్తోంది



- ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్
- పోతులనాగేపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన పరిటాల శ్రీరామ్
- 6+పథకాల విషయంలో ప్రజల సంతృప్తి.. పలు సమస్యలపై విజ్ఞప్తులు

**ధర్మవరం జులై 27, అనంత జనశక్తి న్యూస్:**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం మండలం పోతులనాగేపల్లిలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి.. రెండేళ్లలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పథకాల విషయంలో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల పింఛన్లు, తల్లికి వందనం పథకంకి సంబంధించిన కొన్ని సమస్యలను శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వాటి గురించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. గ్రామంలో సమస్యల గురించి కూడా శ్రీరామ్ అడిగి తెలుసుకున్నారు. రెండేళ్లలో తమకు పథకాలు బాగా అందాయని.. పాలన కూడా బాగుందన్న అభిప్రాయం కనిపించింది. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ రెండేళ్లలో తాము చేసిన వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కేవలం చేసింది మాత్రమే చెప్పకుండా సమస్యల గురించి కూడా అడిగి తెలుసుకుంటున్నామన్నారు. 45రోజుల పాటు మా పార్టీ శ్రేణులు మొత్తం ప్రజల్లోనే ఉంటామన్నారు. ప్రతి ఇంటిని, ప్రతి ఓటర్ ను కలుసుకుంటామన్నారు. ప్రజల్లో మా పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సుమారు 10లక్షల కోట్లకు పైగా అప్పు ఉన్న రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి వైపు నడిపించడం అంత సులువైంది కాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రంలో ఓ వైపు సంక్షేమ కార్యక్రమాలు ఇస్తూ.. ఇంకోవైపు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తున్నారని.. లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అందుకే ప్రజలు తమ పాలనకు మద్దతు చెబుతున్నారని శ్రీరామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ తో పాటు విజయ్ చౌదరి, రాంపురం శీన, వార్డ్ నాయకులు, ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో ఏం చేశామో ప్రజలే చెబుతున్నారు



- మీరు ఐదేళ్లలో ఏం చేశారో చెప్పగలిగే ధైర్యం ఉందా
- ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో పరిటాల సునీత
- పాపంపల్లిలో రూ.1 కోటి అభివృద్ధి పనులు, వాటర్ ప్లాంట్ ప్రారంభం
- గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధిని వివరించిన సునీత
- హంద్రీనీవా గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న సునీత

**రాప్తాడు జులై 27, అనంత జనశక్తి న్యూస్**

రెండేళ్ల కూటమి ప్రభుత్వం హయాంలో మేము ఏం చేశామన్నది ప్రజలే వివరిస్తున్నారని.. మరి ఐదేళ్లలో మీరు ఏం చేశారో చెప్పుకునే ధైర్యం ఉందా అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వైసీపీకి సవాల్ విసిరారు. ఆత్మకూరు మండలం, ముట్టాల పంచాయతీ, పాపంపల్లి గ్రామంలో ఆమె రెండేళ్ల పాలనపై ఇంటింటికీ ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురిపిస్తూ గ్రామంలోకి స్వాగతం పలికారు. ముందుగా ఆత్మకూరు పేరూరు ప్రధాన రహదారి నుంచి పాపంపల్లి వరకు 50లక్షల డీఎంఎఫ్ నిధులతో నిర్మించిన బీ.టీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం పాపంపల్లి గ్రామంలో 50లక్షల ఎం.జి ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులతో నిర్మించిన అంతర్గత సి.సి రోడ్లను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతపురం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 91అంగన్వాడీ సెంటర్లకు ఇండక్షన్ స్టవ్ లు, వంట పాత్రలు ఎమ్మెల్యే సునీత పంపిణీ చేశారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణీ స్త్రీలకు సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి కార్యక్రమంలో భాగంగా రూ.4.50 లక్షల మండల పరిషత్ నిధులతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఆ తర్వాత ఆమె గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్తూ రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ రెండేళ్లలో ఎలాంటి పథకాలు వచ్చాయి.. అలాగే గ్రామం, మండలం, నియోజకవర్గం, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు మీకు తెలుసా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల విషయంలో ప్రజలు పూర్తి స్థాయిలో ఆనందం వ్యక్తం చేశారు. అభివృద్ధి గురించిన కరపత్రాలు అందజేస్తూ ఎమ్మెల్యే సునీత ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాటలాడుతూ ఈ రెండేళ్లలో ఎలాంటి పథకాలు అందించామన్నది ప్రజలే వివరిస్తున్నారన్నారు. పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి పథకాల విషయంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇవే కాకుండా మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీ చేశామన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా పల్లె పండుగ పేరుతో 8వేల కిలోమీటర్ల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు.

ఈ రెండేళ్లలోనే రాప్తాడు నియోజకవర్గంలో 275కోట్లతో వివిధ పథకాల కింద రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని.. రాయలసీమ ప్రాంతానికి లక్ష కోట్ల వరకు పెట్టుబడులు వచ్చాయన్నారు. మరోవైపు హంద్రీనీవా కాలువను 3800క్యూసెక్కుల వెడల్పు చేసి అన్ని ప్రాంతాలకు నీరు ఇస్తున్నట్టు చెప్పారు.హంద్రీనీవా గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్నారు. పేరూరు జలాశయానికి నీరు ఇచ్చే పనులు గత టీడీపీ హయాంలో ఇదే పంచాయతీలో చేపడితే..గత ఐదేళ్లలో ఒక గంపెడు మట్టి కూడా తీయలేదన్నారు. ఇప్పుడు కూటమి వచ్చాకే మళ్లీ పనులు మొదలవుతున్నాయన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే హంద్రీనీవా గురించి వైసీపీ నాయకులు అసత్యప్రచారాలు చేస్తున్నారని.. ఇలాంటి వాటిని నమ్మవద్దని ఎమ్మెల్యే సునీత సూచించారు...



# సంక్షేమ పథకాలతో ప్రజల్లోకి ఎన్డీఏ ప్రభుత్వం..

**గాండ్లపెంట, జులై,27, అనంత జనశక్తి న్యూస్:**

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో సోమవారం ఎన్డీఏ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రచార కార్యక్రమాన్ని టీడీపీ మండల కన్వీనర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో ప్రజలకు ప్రభుత్వం మేలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రతి ఇంటికి ప్రభుత్వ పనితీరును వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల సోమశేఖర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, దోనికొండ ఆనంద్, అక్రమ్ సికిందర్, డీలర్ బాబు, బి. రవీందర్ రెడ్డి, పి. ఆదిరెడ్డి, వినుస ఆసిఫ్ ఫీల్డ్ అసిస్టెంట్ బావుద్దీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జూలై 31 కలెక్టర్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయండి

- స్కీమ్ వర్కర్ల పిలుపు

**రాప్తాడు, జులై 27 అనంత జనశక్తి న్యూస్**

జూలై 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే స్కీమ్ వర్కర్ల రాష్ట్రవ్యాప్త ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ రాప్తాడు మండల కేంద్రంలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది మధ్యాహ్న భోజనం, కార్మికులు, శానిటేషన్ వర్కర్లు, VVOలు, పాఠశాల నైట్ వాచ్‌మెన్ తదితర స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై 31న ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని తెలిపారు. స్కీమ్ వర్కర్లందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుతం స్కీమ్ వర్కర్లతో అధిక పని చేయించుకుంటూ తక్కువ గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారని, నాసిరకం సెల్‌ఫోన్లు అందించి అనేక యాప్‌లలో పని చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ కూడా సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ వేతనం పేరుతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు.

స్కీమ్ వర్కర్లందరికీ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం. నాగమణి, ఆశా యూనియన్ అధ్యక్షురాలు మాలతి, ఉపాధ్యక్షురాలు గాయత్రి, రైతు సంఘం మండల నాయకుడు పోతులయ్య, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
మంగళవారం | అనంతపురం
28.07.2026
ANDHRA PRADESH NEWS ఆంధ్రప్రదేశ్ న్యూస్

## ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.

**శెట్టూరు జులై 27.**

**అనంత జనశక్తి న్యూస్.**



కళ్యాణదుర్గం శాసనసభ్యులు ఎమ్మెల్యే మరియు ఎస్ఆర్సి ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 7300 మంది విద్యార్థులకు ఉచిత సైకిల్ పంపిణీ కార్యక్రమాన్ని. శెట్టూరు మండలం ములకలేడు జిల్లా పరిషత్ పాఠశాలలో బాలికలకు సైకిల్ పంపిణీ కార్యక్రమం నియోజకవర్గంలో మొట్టమొదటిగా ము లకలేడు పాఠశాలలో. MLA ప్రారంభిస్తున్నారు కావున మండలంలోని తెలుగుదేశం పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ హాజరై ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా. ఒక ప్రకటనలోతెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్.TR.తిప్పేస్వామి తెలియజేశారు

## మా సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటాలు ఆపము..



**- దస్తావేజు లేఖరులు.**

**ధర్మవరం జులై 27, అనంత జనశక్తి న్యూస్:**

మా సమస్యలు పరిష్కరించేంతవరకు మా పోరాటాలు ఆపము అని దస్తావేజు లేఖలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జూలై నెల 20వ తారీకు నుండి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరులు తలపెట్టిన పెన్ డౌన్ కార్యక్రమం ఎనిమిదో రోజు చేరుకుంది. ఇందులో భాగంగా పుట్టపర్తి లోని కలెక్టర్ కార్యాలయానికి దస్తావేజులేఖర్లతో కలసి వెళ్లి జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్కు అందజేయడం జరిగిందన్నారు. మన సమస్యలు పరిష్కారమే ఇంతవరకు ఐక్యమత్తంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో
దస్తావేజులేఖర్ల సంఘం అధ్యక్షులు జావిద్, ఉపాధ్యక్షులు భాస్కర్, సెక్రటరీ జూటూరి మహేంద్ర, జాయింట్ సెక్రెటరీ నాగార్జున, సభ్యులు సుధాకర్, ధను, గోపి, వెంకటేష్, రామాంజనేయులు, కీర్తి ,తదితర దస్తావేజులేఖరులు పాల్గొన్నారు.

## డీఎస్పీగా బి.వి.జె. రాజు బాధ్యతల స్వీకరణ

**- శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం...**
**- ప్రజలకు మెరుగైన పోలీసు సేవలే లక్ష్యం....**

**ధర్మవరం జులై 27 అనంత జనశక్తి న్యూస్ :**




ధర్మవరం డివిజన్ నూతన డీఎస్పీగా బి.వి.జె. రాజు సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎస్పీ బి.వి.జె. రాజు మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలకు సత్వర, పారదర్శక, సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, మహిళల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వబోమని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, వారి ఫిర్యాదులపై వేగంగా స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.వి.జె. రాజు హామీ ఇచ్చారు. పోలీసు ప్రజల మధ్య మరింత సత్సంబంధాలు పెంపొందిస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందిస్తామని స్పష్టం చేశారు.

## సంక్షేమ పథకాలతో ప్రజల్లోకి టీడీపీ ప్రభుత్వం

**అమడగూరు, జూలై,27, అనంత జనశక్తి న్యూస్:**

అమడగూరు,మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో సోమవారం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం, రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రచార కార్యక్రమాన్ని టీడీపీ మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి ప్రభాకర్ రెడ్డి, ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కస్టర్ ఇంచార్జి ప్రభాకర్ రెడ్డి, మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో ప్రజలకు ప్రభుత్వం మేలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రతి ఇంటికి ప్రభుత్వ పనితీరును వివరించాలని కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ ప్రభాకర్ రెడ్డి మాజీ సర్పంచ్ కాసుల వెంకటరమణ, అమడగూరు యూత్ నాయకుడు సర్వేయర్ సురేంద్ర బూత్ కన్వీనర్ ఏ రామాంజులు, ఫోటో స్టూడియో మూర్తి, పెద్దక శివారెడ్డి, రమేష్నాయుడు, రమణప్ప,రామప్ప బూత్ కన్వీనర్ రామచంద్ర, ఆధ్వర్యంలో,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్థానిక ఉపాధిని కాపాడండి!!

**- లెన్స్‌కార్ట్ షోరూమ్ ఎదుట స్థానిక వ్యాపారులు, ఉద్యోగుల ధర్నా**
**- నిరసనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**ధర్మవరం జూలై 27, అనంత జనశక్తి న్యూస్:**




పట్టణంలోని పుట్టపర్తి రోడ్‌లో గల జి వి ఆర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేస్తున్న లెన్స్‌కార్ట్ షోరూమ్ ఎదుట స్థానిక ఆప్టికల్ వ్యాపారులు, ఉద్యోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బహుజన్ సమాజ్ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు సాకే. వినయ్ కుమార్, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు మంజుల నరేంద్ర నాయకత్వం వహించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా సాకే. వినయ్ కుమార్ మాట్లాడుతూ...... ధర్మవరం పట్టణంలో దశాబ్దాలుగా స్థానిక ఆప్టికల్ వ్యాపారాలు నిర్వహిస్తూ సుమారు 200 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో పెద్ద కార్పొరేట్ సంస్థలు రావడం వల్ల స్థానిక చిన్న వ్యాపారులు, ఉద్యోగుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల ఓట్లతో ఎన్నికైన ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ స్థానిక ప్రజలు, చిన్న వ్యాపారులు, ఉద్యోగుల సమస్యలపై స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్పొరేట్ సంస్థలకు సంబంధించిన అంశాల్లో అధికారులు వెంటనే స్పందిస్తుండగా, స్థానిక ప్రజల సమస్యలు మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని విమర్శించారు.అలాగే సంబంధిత భవనానికి ఉన్న భవన నిర్మాణ అనుమతులు, కమర్షియల్ వినియోగ అనుమతులు, ట్రేడ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ అనుమతులు మరియు ఇతర చట్టబద్ధ పత్రాలను సంబంధిత శాఖలు సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారుల విచారణలో నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే వర్తించే చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.స్థానిక చిన్న వ్యాపారాలు, ఉద్యోగాలు దెబ్బతినకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, స్థానిక ఉపాధి పరిరక్షణకు స్పష్టమైన విధానాలు రూపొందించాలని, చిన్న వ్యాపారుల జీవనోపాధిని కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని సాకే వినయ్ కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆప్టికల్ వ్యాపారులు, ఉద్యోగులు, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ నాయకులు, సీపీఐ(ఎంఎల్) నాయకులు మరియు పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈఆటోలతో మెరుగైన పారిశుధ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ:మంత్రి కందుల దుర్గేష్

**తూర్పుగోదావరి జిల్లా**
**జూలై 27 అనంత జనశక్తి న్యూస్**



తూర్పు గోదావరి జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి నుండి చెత్త సేకరణ ప్రక్రియలను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 44 విద్యుత్ తో నడిచే ఈ ఆటోలను మంజూరు చేసింది. ఒక్కొక్కటి 3,18,400 రూపాయలు చొప్పున 1,40,09,600 రూపాయల విలువైన 44 ఇఆటోలు తూర్పు గోదావరి జిల్లాకు మంజూరు అయ్యాయి. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ లతో కలిసి జిల్లాలోని 11 మండలాల పరిధిలోని 37 గ్రామ పంచాయతీలకు ఈఆటోలను పంపిణీ
చేసి జెండా ఊపి వాటిని ప్రాంభించారు. అనంతరం మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు ఈ ఆటోలను స్వయంగా నడిపారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ .. రాష్ట్రంలో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం అన్ని గ్రామాలు, పట్టణాల్లో చురుగ్గా సాగుతోందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. 2047 నాటికి కేంద్ర ప్రభుత్వ 'వికసిత్ భారత్' స్ఫూర్తితో స్వర్ణాంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు.ఇందులో భాగంగానే తూర్పుగోదావరి జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు 1,40,09,600 రూపాయల వ్యయంతో 44 ఈఆటోలను పంపిణీ చేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. వీటిని నియోజకవర్గాల వారీగా రాజమహేంద్రవరం రూరల్ కు 12 , రాజానగరం కు 7, మండపేట కు 4, కొవ్వూరుకు 9, నిడదవోలు కు 8, గోపాలపురం కు 4 కేటాయించడం జరిగిందన్నారు. కాలుష్య నివారణతో పాటు ఆటోలు నడిపే కార్మికులకు లాభదాయకంగా ఉండేలా పెట్రోల్, డీజిల్ వాహనాలకు బదులుగా ఈఆటోలను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేసారు. ఇంటింటి చెత్త సేకరణలో తడి, పొడి మరియు హానికరమైన చెత్తను వేరుచేయడానికి వీలుగా ఈ ఆటోల్లో ఆరు ప్రత్యేక డబ్బాలను సైతం ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన వాహనాలు సరైన నిర్వహణ లేక మూలనపడిన పరిస్థితి తిరిగి తలెత్తకుండా ప్రస్తుత ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. ఈఆటోల నిర్వహణలో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తితే తక్షణం పరిష్కరించేందుకు కుప్పం నియోజకవర్గంలో 10 మంది టెక్నోక్రాట్లతో కూడిన ప్రత్యేక బృందాన్ని అందుబాటులో ఉంచారని, అవసరమైతే విజయవాడకు చెందిన సాంకేతిక నిపుణుల సేవలను కూడా వినియోగించుకుంటామని వెల్లడించారు. దీనికి తోడు జల వనరుల కాలుష్యాన్ని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మురుగునీటి శుద్ధి కర్మాగారాలను (STPs) పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ప్రజల పూర్తిస్థాయి భాగస్వామ్యంతోనే ఈ స్వచ్ఛతా కార్యక్రమం విజయవంతమవుతుందని, ప్రజలందరూ అవగాహన పెంచుకుని సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్, డిపిఓ వి. శాంతామణి, ఆయా పంచాయితీల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 33శాతం మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్‌కోటా తేల్చాలి



**- బీసీ సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ బాబు**

**అనంతపురం, జూలై 27 :అనంత జనశక్తి న్యూస్**

చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నప్పటికీ, ఆ రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు వివి భాస్కర్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ బాబు మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు వాటా నిర్ధారించాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. 1996 నుంచే బీసీ మహిళల ఉప కోటా అంశం వివాదాస్పదంగా మారి బిల్లులు నిలిచిపోయాయని, అప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఓబీసీ, మహిళా సంఘాలు నిరంతరం పోరాటాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ, ఓబీసీ మహిళల అంశం ఇంకా స్పష్టత పొందలేదని ఆయన విమర్శించారు. బీసీ మహిళలకు సబ్‌కోటా లేకుండా రిజర్వేషన్లు అమలు చేయడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. మహిళలు సాధారణంగా వెనుకబడ్డ వర్గమైతే, బీసీ మహిళలు మరింత వెనుకబడిన వర్గంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఆధిపత్య వర్గ మహిళలతో పోటీ పడటం బీసీ మహిళలకు కష్టమని, అందువల్ల ప్రత్యేక ఉపకోటా అవసరమన్నారు. మొత్తం మహిళా రిజర్వేషన్లలో కనీసం మూడో వంతు, అంటే సుమారు 11 శాతం బీసీ మహిళలకు కేటాయించాలని భాస్కర్ బాబు సూచించారు. ఈ నిర్ణయం బీసీ మహిళల సాధికారతకు కీలకమవుతుందని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎసఆర్ నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర గౌడ్, స్వర్ణకార సంఘం కార్యదర్శి ముష్టూర్ శ్రీనివాస్ ఆచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేశవ్ కుమార్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మనోజ్ కుమార్, విద్యార్థి నగర అధ్యక్షుడు భరత్ యాదవ్, గురు, ముఖేష్, సాయి, బీసీ నాయకులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తం కావాలి




**- ప్రణాళికాబద్ధంగా పనిచేసి ప్రభావాన్ని ఎదుర్కోవాలి: జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

**అనంతపురం, జూలై 27:అనంత జనశక్తి న్యూస్**

రానున్న రోజుల్లో జిల్లాపై సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా అప్రమత్తంగా పనిచేసి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జిల్లా శానిటేషన్ సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సూపర్ ఎల్‌నినో ప్రభావానికి సంబంధించి తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యవసాయం, ఉద్యానవనం, పంచాయతీరాజ్ తదితర శాఖల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, పాఠశాలలు, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్మిస్తున్న సామూహిక పారిశుద్ధ్య సముదాయాల పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్య పరికరాల జియో ట్యాగింగ్, గ్రీన్ అంబాసిడర్ల వివరాల నమోదు, క్లోరిన్ పరీక్షా కిట్ల అందుబాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి తాగునీరు, సాగునీటి కొరత ఏర్పడే అవకాశమున్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హెచ్‌ఎల్‌సీ పరిధిలోని నీటి వనరులను తాగునీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా ప్రతిరోజూ నీటి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు.జిల్లాలోని 6,167 బోర్‌వెల్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, ఎండిపోతున్న బోర్‌వెల్లను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ వనరులను సిద్ధం చేయాలని సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని పంచాయతీల్లో అవసరమైన నిధులు సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బోర్‌వెల్లకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖకు సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలు రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటలు, నీటి పొదుపు పద్ధతులు, పశుగ్రాసం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పరిశ్రమలు కూడా నీటి సంరక్షణ, పునర్వినియోగ చర్యలు చేపట్టేలా సమన్వయం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డీఆర్‌వో ఏ. మలోల, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, వివిధ శాఖల ప్రత్యేక కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్సీ గ్రౌండ్‌లో జాతరలా సైకిళ్ల పంపిణీ





- 7 వేల మంది ప్రభుత్వ విద్యార్థులకు మంత్రి నారాయణ కుటుంబం నుంచి ఉచిత సైకిళ్లు
- రూ.6 కోట్లతో 10 వేల సైకిళ్ల పంపిణీకి శ్రీకారం.. తొలి విడతలో 7 వేలు అందజేత
- నేను పేదరికాన్ని అనుభవించాను.. ఆ కష్టం మరో పిల్లవాడికి రాకూడదు' – మంత్రి నారాయణ

**నెల్లూరు, జూలై 27 :అనంత జనశక్తి న్యూస్**

వీఆర్సీ గ్రౌండ్ సోమవారం అక్షరాలా జాతరను తలపించింది. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ట్రంక్ రోడ్డు, వీఆర్సీ గ్రౌండ్ కిక్కిరిసిపోయాయి. "థాంక్యూ నారాయణ సార్" అంటూ విద్యార్థుల నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 7 వేల మంది విద్యార్థులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుటుంబం సొంత నిధులతో ఉచిత సైకిళ్లు పంపిణీ చేసింది. మొత్తం 10 వేల మంది విద్యార్థులకు రూ.6 కోట్ల వ్యయంతో సైకిళ్లు అందించే కార్యక్రమంలో తొలి విడతగా ఈ పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ తన జీవిత ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. "నేను పేదరికాన్ని పుస్తకాల్లో చదవలేదు... జీవితంలో అనుభవించాను. గుడిసెలో పుట్టి, హరనాథపురం నుంచి వీఆర్సీ వరకు కాలినడకన వెళ్లి చదివాను. మా నాన్న ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించారు. అప్పుడే బాగా చదివి పేదరికాన్ని జయించాలని నిర్ణయించుకున్నాను" అని భావోద్వేగంగా చెప్పారు.

ఎన్నికల సమయంలో 80 వేల ఇళ్లు తిరిగినప్పుడు పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తనను కలచివేశాయని, వారికి నాణ్యమైన విద్యను ఆస్తిగా అందిస్తానని అప్పుడే నిర్ణయించుకున్నానని తెలిపారు.తాను చదివిన వీఆర్సీ విద్యాసంస్థను రూ.17 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దామని, ప్రస్తుతం అక్కడ 1,100 మంది నిరుపేద విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. నగరంలోని మరో 14 ప్రభుత్వ హైస్కూళ్లను ఆధునీకరిస్తున్నామని, వక్ఫ్ బోర్డు స్థలంలో రూ.20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల మెటీరియల్‌ను ఉచితంగా అందించి, ఆగస్టు 1 నుంచి ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. "నేను నడిచి వెళ్లిన కష్టాలు ఈ తరం పిల్లలకు ఉండకూడదు. అందుకే సైకిళ్లు ఇస్తున్నాం. ఇవి కేవలం వాహనాలు కావు... మీ కలలకు చక్రాలు" అని విద్యార్థులకు పిలుపునిచ్చారు.కుటుంబ సభ్యులతో చర్చించి రూ.6 కోట్లతో 10 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు అందించాలని నిర్ణయించామని, తొలి విడతలో 7 వేల మందికి పంపిణీ చేశామని, మిగిలిన 3 వేల మందికి జనవరిలో అందజేస్తామని తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందించిన మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారు.

**నాన్న స్ఫూర్తితోనే మా సేవా కార్యక్రమాలు"**

మంత్రి కుమార్తె పొంగూరు సింధుర మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తన తండ్రి కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకున్నారని, అదే స్ఫూర్తితో పేద విద్యార్థుల కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

పొంగూరు షరణి మాట్లాడుతూ నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లాలన్నదే తమ కుటుంబ లక్ష్యమని తెలిపారు.జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ మంత్రి నారాయణ చేపడుతున్న కార్యక్రమాలు పేద విద్యార్థులను సాధికారత వైపు నడిపిస్తున్నాయని కొనియాడారు. బాలికలకు ఈ సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పేద పిల్లల భవిష్యత్తు కోసం మంత్రి కుటుంబం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. వేలాది మంది విద్యార్థుల కళ్లల్లో కనిపించిన ఆనందమే ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు.మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ ఒకే రోజు 7 వేల సైకిళ్ల పంపిణీ చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు.

రూరల్ ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అడగ్గానే సైకిళ్ళు నెల్లూరు రూరల్ కి ఇచ్చిన గొప్ప వ్యక్తి మంత్రి నారాయణ అని కొనియాడారు.రూరల్ అభివృద్ధికి నారాయణ సార్ కుటుంబం ఎప్పుడు అండగా ఉండాలని కోరారు.రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఈరోజు చాలా సంతోషమైన రోజన్నారు.కార్పొరేట్ కి దీటుగా పేద పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విధ్య అందించాలని నారాయణ సార్ సంకల్పించారని తెలిపారు.నారాయణ మెటీరియల్ ఉచితంగా వచ్చి ఐఐటీ ఫౌండేషన్ ఇచ్చి ఎంతో మంది పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చారన్నారు.నిరుపేద పిల్లల చదువుకు నేనున్నానని బరోసా కల్పిస్తున్నారన్నారు.వక్ఫ్ బోర్డు స్థలంలో 20 కోట్ల సీఎస్ ఆర్ ఫండ్స్ తో అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తున్నారని తెలిపారు.

నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఇది గిన్నిస్ బుక్‌లో నమోదయ్యే స్థాయి కార్యక్రమమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్,మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి,అల్లుళ్ళు పునీత్,గంటా రవితేజ,నారాయణ విద్యాసమస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి,రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,సంతపేట ఆంజనేయస్వామి ఆలయ చైర్పర్సన్ విజేతా రెడ్డి ,నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు టీడీపీ నేతలు జహీర్,బాలాజీ,తిరుమల నాయుడు,కిన్నెర మాల్యాద్రి ,మొయినుద్దీన్,కర్తం ప్రతాప్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.





# ఇంటింటికి టీడీపీతో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



- తిమ్మసముద్రంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు – ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం, జూలై 27:అనంత జనశక్తి న్యూస్**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపట్టినట్లు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు.కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ దొడగట్ట 1, 2 వార్డుల్లో నిర్వహించిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, మహర్షి వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో 95 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో హంద్రీ-నీవా ద్వారా 1,800 క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ చర్యలతో 3,400 క్యూసెక్కుల కృష్ణా జలాలు జిల్లాకు అందుతున్నాయని పేర్కొన్నారు.బీటీపీ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన రైతులకు ఆగస్టు చివరి నాటికి పరిహారం అందజేస్తామని, కాలువ పనులు పూర్తి చేసి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిమ్మసముద్రం ప్రాంతంలో ఇప్పటికే 1,200 ఎకరాలు పరిశ్రమల కోసం సేకరించామని, మరో 3,000 ఎకరాలు సేకరించి రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.దొడగట్ట ఎస్సీ కాలనీలో 24 ఏళ్లుగా పరిష్కారం కాని డ్రైనేజీ సమస్యను నాలుగు నెలల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మంగళవారం నుంచి గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు.

అనంతరం దొడగట్ట ప్రాథమికోన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. మహర్షి వాల్మీకి విగ్రహానికి పైకప్పు నిర్మాణం కోసం తన స్వంత నిధుల నుంచి రూ.1 లక్ష అందజేశారు.అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ నాగరాజుకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు, మార్కెట్ యార్డు చైర్మన్, పట్టణ టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# డోర్ టు డోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట



- ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరణ

**తలుపుల, జూలై 27:అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తలుపుల మండలం ఉడుములకుర్తి పంచాయతీ పరిధిలోని సోమాలవాండ్లపల్లి గ్రామంలో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించిన ఎమ్మెల్యే ప్రజలను ఆప్యాయంగా పలకరించి, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.అనంతరం మాట్లాడుతూ, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే నిజమైన ప్రజాపాలన అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ చేస్తున్న విమర్శలను ఆయన ఖండిస్తూ, గత ప్రభుత్వ హయాంలో నియామకాలు, పరిపాలనపై అనేక వివాదాలు చోటుచేసుకున్నాయని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు.ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చెంచయ్య నాయుడు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డాక్యుమెంట్ రైటర్ల ఉపాధిని కాపాడాలి




- జీవో 396ను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి మహిళా నాయకురాలి విజ్ఞప్తి

**అనంతపురం, జూలై 27:అనంత జనశక్తి న్యూస్**

జీవో 396ను రద్దు చేసి డాక్యుమెంట్ రైటర్ల ఉపాధిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ గత ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న నిరవధిక పెన్‌డౌన్ సమ్మె సోమవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. డాక్యుమెంట్ రైటర్లు, వారి సహాయకులు, డీటీపీ ఆపరేటర్లు సమ్మెలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమ్మెకు మద్దతు తెలిపిన గ్రామాభ్యుదయ మహిళా మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు, సామాజిక కార్యకర్త మాట్లాడుతూ, డాక్యుమెంట్ రైటర్లు ప్రభుత్వం-ప్రజల మధ్య వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. జీవో 396 ద్వారా ప్రైవేటు సేవా కేంద్రాలకు అవకాశాలు కల్పించి వేలాది డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధిపై ప్రభావం చూపడం సరైన చర్య కాదని విమర్శించారు.రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలకు అవసరమైన పత్రాలను సిద్ధం చేయడం, వారి సమస్యలను పరిష్కరించడంలో డాక్యుమెంట్ రైటర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. స్థిరమైన ఆదాయం లేకపోయినా ప్రజలకు సేవలందిస్తూ తమతో పాటు అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు.గతంలో లైసెన్స్ విధానం రద్దు అయినప్పటికీ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కంప్యూటర్ పరిజ్ఞానం నేర్చుకుని సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రతిపాదించిన విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమవడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రజలకు, డాక్యుమెంట్ రైటర్లకు ఇబ్బందులు కలగకుండా జీవో 396పై పునఃసమీక్ష చేపట్టి, వారి ఉపాధికి భరోసా కల్పించాలని కోరారు. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

# పీజీఆర్ఎస్‌లో 112 ఫిర్యాదులు స్వీకరణ



- నిర్ణీత గడువులో సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

**అనంతపురం, జూలై 27: అనంత జనశక్తి న్యూస్**

జిల్లా ప్రజల సమస్యలను చట్టపరిధిలో వేగంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. నాగభూషణం, ఎస్. మహబూబ్ బాషా మొత్తం 112 ఫిర్యాదులను స్వీకరించారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఓపికగా విన్న అధికారులు, ఫిర్యాదుల తీవ్రతను బట్టి సంబంధిత పోలీసు అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి, చట్టప్రకారం విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీలు మాట్లాడుతూ, ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం చేయడం పోలీసు శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించి బాధితులను ఇబ్బందులకు గురిచేయకుండా సమయపాలనతో ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు.దూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమానికి వచ్చిన బాధితులు, వారి సహాయకులకు భోజనం అందించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# ఇంటింటా టీడీపీ ప్రచారానికి శ్రీకారం

- కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలకు వివరిస్తాం: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**కొత్తచెరువు, జూలై 27:అనంత జనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తామని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అన్నారు. సోమవారం సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు మండలం కేశాపురం పంచాయతీలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఇంటింటా తెలుగుదేశం ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి గ్రామస్తులు పూలవర్షం కురిపిస్తూ, మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు.ప్రచార కార్యక్రమంలో మాట్లాడిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం విధ్వంసాన్ని చూసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో గత రెండేళ్లలో రూ.2,202.07 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.పుట్టపర్తిలో రూ.15,803 కోట్ల వ్యయంతో సుమారు 650 ఎకరాల్లో యుద్ధ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అమడగూరు మండలంలో రూ.51,300 కోట్లతో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, దీని ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు.హంద్రీ-నీవా కాలువ ద్వారా 193 చెరువులు, రెండు రిజర్వాయర్లకు కృష్ణా జలాలు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు.రాయలసీమ అభివృద్ధికి సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులతో పాటు రూ.30 వేల కోట్ల వ్యయంతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# అప్పుల భారంలోనూ తగ్గేదేలే.. మేనిఫెస్టో అమలే ధ్యేయం.. మంత్రి నారాయణ

- నెల్లూరు 48వ డివిజన్లో ఇంటింటికీ టిడిపిలో మంత్రి
- మంచి పనులపైనా బురద రాజకీయాలా? ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డ మంత్రి నారాయణ
- 16 వేల టీచర్ పోస్టులు ఇస్తుంటే గందరగోళమా? వైకాపా వైఫల్యాలను ఎండగట్టిన మంత్రి పొంగూరు
- లోకేష్ వేవ్.. ఏపీకి 25% పెట్టుబడులు.. త్వరలోనే భారీగా ఉద్యోగాలు.. మంత్రి నారాయణ ప్రకటన

**నెల్లూరు జూలై 27 అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరులోని 48వ డివిజన్ పొర్లుకట్ట ప్రాంతంలో ఇంటింటికీ టిడిపి కార్యక్రమాన్ని రాష్ట్ర పట్టణ పుర పాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోగా, తమ కూటమి ప్రభుత్వం చక్కగా 16,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుంటే ప్రతిపక్షం అనవసరంగా రాజకీయం చేస్తూ గందరగోళం సృష్టిస్తోందని తీవ్రంగా విమర్శించారు. నెల్లూరు అభివృద్ధిలో భాగంగా ప్రతి 5 మీటర్లకు ఉచితంగా ఒక చెట్టును నాటించినా అవినీతి రంగు పులిమారని, VRC ల్ బ్రహ్మాండంగా అభివృద్ధి చేసినా విమర్శలు చేశారని, విద్యార్థులకు పంపిణీ చేసిన 7,000 సైకిళ్లపై కూడా బురద చల్లుతున్నారని మండిపడ్డారు. మంచి పనులను అభినందించకుండా ప్రతిదానికీ ప్రతిపక్షాలు రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు.జూన్ 12 నాటికి కూటమి ప్రభుత్వం 2 ఏళ్లు పూర్తి చేసుకుందని, గత ప్రభుత్వం చేసిన 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోస్తూనే మేనిఫెస్టోలోని హామీలను ముఖ్యమంత్రి నెరవేరుస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద వృద్ధులకు 4,000, వికలాంగులకు 6,000, కిడ్నీ బాధితులకు 10,000, అటెండర్ సహాయం ఉన్నవారికి 15,000 పెన్షన్లు అందిస్తున్నామన్నారు. తాను తిరిగిన ఇళ్లలో తల్లికి వందనం ద్వారా ఒక్కో ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా లబ్ధి చేకూరుతూ 26,000 నుండి 39,000 వరకు అందుతుండటంతో ప్రజలు చాలా ఆనందంగా ఉన్నారని చెప్పారు. వీటితో పాటు దీపం 2 కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, చేనేతలకు 200, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లకు 15,000, అన్నదాత సుఖీభవ కింద రైతులకు 20,000,5లకే అన్నా క్యాంటీన్ భరోసా ఇస్తున్నామని వివరించారు. యువ నేత లోకేష్ కృషి వల్ల దేశంలోని మొత్తం పెట్టుబడులలో 25% మన రాష్ట్రానికే వచ్చాయని, రాబోయే 23 ఏళ్లలో భారీగా ఉద్యోగాలు రానున్నాయని చెబుతూ, ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడానికే టిడిపి కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్తున్నామని పొర్లుకట్టలో నారాయణ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ , సంతపేట ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్ విజేత రెడ్డి , రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు , 48వ డివిజన్ ప్రెసిడెంట్ పెంచల బాబు , ఇలియాస్ క్లోకాస్టర్, క్లస్టర్ జాఫర్, సుబ్బారావు, కంటెస్టెంట్ కీర్తి,జనరల్ సెక్రెటరీ నవీన్,బూత్ కన్వీనర్లు,గోపి, హుస్సేన్ ఫయాజ్, యాస్మిన్ కర్ణ ,మహిళా డివిజన్ ఇంచార్జ్ సునీత, రేష్మ, రిజ్వానా ,చాదు,గణేష్ స్థానిక టిడిపి నేతలు పాల్గొన్నారు.

## మంత్రి పదవి వీడినా
# ధైర్యం వీడలేదు

### ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలు వైరల్

**న్యూఢిల్లీ, జూన్ 27 :అనంత జనశక్తి న్యూస్**

కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం తొలి సారిగా పార్లమెంట్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్డీఏ ఎంపీలు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. రాజీనామా చేసినప్పటికీ ఆయన ముఖంలో ఎలాంటి నిరాశ కనిపించకుండా చిరునవ్వుతో అందరినీ పలకరించారు. పార్లమెంట్ కారిడార్లలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. "ఇలా జరుగుతూ ఉంటుంది" అని ఆయన చెప్పగా, వెంటనే స్పందించిన ప్రధాన్ "ఏమీ జరగలేదు" అని సమాధానం ఇచ్చారు. అనంతరం "నేను వీధి యోధుడిని.. ఏసీ గది కార్యకర్తను కాదు" అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంట్‌కు వచ్చిన సందర్భంగా ఎన్డీఏ ఎంపీలు ఆయనకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఒక ఎంపీ మాట్లాడుతూ, "ఎలాంటి వ్యక్తిగత అభియోగాలు లేకుండానే ఒక కేంద్ర మంత్రి రాజీనామా చేయడం ఇదే తొలిసారి" అని వ్యాఖ్యానించారు. ప్రధాన్ తీసుకున్న నిర్ణయం రాజకీయ బాధ్యతకు నిదర్శనమని పలువురు బీజేపీ నాయకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు, ధర్మేంద్ర ప్రధాన్ భవిష్యత్ రాజకీయ పాత్రపై కూడా ఆసక్తికర చర్చ సాగుతోంది. ఒడిశా బీజేపీలో అత్యంత ప్రభావవంతమైన నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన, జాతీయ స్థాయిలో కూడా పార్టీ విజయాల్లో కీలక పాత్ర పోషించారు. బీహార్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో పార్టీ ఎన్నికల వ్యూహకర్తగా పనిచేసి విజయాలకు దోహదపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో కూడా పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి ప్రస్తావనీయమే. రాజీనామా అనంతరం కూడా పార్టీ ఆయనపై పూర్తి విశ్వాసం ఉంచినట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించగా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు పలువురు బీజేపీ అగ్రనేతలు ధర్మేంద్ర ప్రధాన్ చేపట్టిన విద్యా సంస్కరణలను ప్రశంసించారు. ఆయన రాజీనామా విశ్వసనీయత కోల్పోయిన సంకేతం కాదని, రాజకీయ జవాబుదారీతనం మరియు త్యాగానికి నిదర్శనమని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ తాజా వ్యాఖ్యలు చూస్తే ఆయన పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ సంస్థలో ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి

- ఎల్.నినో నేపథ్యంలో పిఎండిఎస్ కింద పెలెటైజేషన్ తో పంటల సాగు చేసేలా చూడాలి
- అత్యధిక ప్రాధాన్యతతో బీమా చేయించాలి
- వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, జూన్ 27 :అనంత జనశక్తి న్యూస్**



ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), ఎల్.నినో, అగ్రికల్చర్, ఎన్ఆర్ఈజిఏ, రెవెన్యూ, రీసర్వే, జి.ఎస్.డబ్ల్యు.ఎస్, తదితర అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎపిడిలు, ఎపిఓలు, సంబంధిత శాఖల మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలను గడువు తీరకముందే పరిష్కరించాలని, గడువు తీరినవి పెండింగ్ ఉంచడానికి వీలు లేదన్నారు. పరిష్కరించ గలిగిన గ్రీవెన్స్ ను పరిష్కరించాలని, పరిష్కరించలేనివి ఎందుకు చేయలేమో తెలపాలని, పెండింగ్ ఉంచడానికి మాత్రం వీలు లేదన్నారు. అర్జీలను సరిగా పరిష్కరించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆత్మకూరు మండలంలో నిర్వహించే ఒక నెల ఒక నియోజక వర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమంలో ప్రతి గురువారం నెల రోజులపాటు ఆర్డీవో పాల్గొనాలని, మండలంలో ఆరు నెలల పాటు వచ్చిన కేసులను మానిటర్ చేయాలని, ఇందుకు సంబంధించి మూడు వారాల్లో ఫీడ్బ్యాక్ ఇవ్వాలన్నారు. 100 శాతం ఈ ఆఫీస్ లోనే ఫైల్ లను పంపించాలని, ఫిజికల్ మోడ్లో పంపరాదన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఎల్.నినో వల్ల పిఎండిఎస్ (PreMonsoon Dry Sowing) పద్ధతిలో విత్తనాలు వేయించేలా చూడాలని, ఇప్పుడు వర్షం వస్తే పీఎండీఎస్ ద్వారా పంటల సాగుకు అవకాశం ఉంటుందన్నారు. పిఎండిఎస్ పై ప్రతి హార్టికల్చర్ అధికారులకు అవగాహన కల్పించాలని, పిఎండిఎస్ కింద పెలెటైజేషన్ తో పంటల సాగులో పురోగతి చాలా తక్కువగా ఉందని, వంద శాతం పెలెటైజేషన్ జరిగేలా చూడాలని, దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని, చీని, దానిమ్మ, తదితర పంటల సాగులో కూడా పెలెటైజేషన్ చేయాలన్నారు. ఈ ప్రక్రియలో వెనుకబడిన చివరి 10 మండలాల వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మానిటర్ చేయాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY) మరియు పునర్వ్యవస్థీకృత వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (RWBCIS) కింద 1,34,985 హెక్టార్లకు సంబంధించి బీమా నమోదు చేపట్టడం జరగగా, వచ్చే నాలుగైదు రోజులు అత్యధిక ప్రాధాన్యతతో అన్ని పంటలకు బీమా చేయించాలని ఆదేశించారు. హార్టికల్చర్ రైతులతో అవగాహన కార్యక్రమంలో నిర్వహించి బీమా చేసుకునేలా చూడాలని, పూర్తిస్థాయిలో 100 శాతం బీమా లక్ష్యం చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ సైనికులకు సంబంధించి ఆగస్టు 15వ తేదీన పట్టాలు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని, దీనిపై ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకు అవసరమైన భూమిని సిద్ధం చేయాలని, వచ్చే శనివారం దీనిపై ప్రత్యేక డ్రైవ్ పెట్టాలని ఆదేశించారు. ఎన్ఆర్ఈజిఎస్ కింద ఎల్.నినో ప్రభావంతో డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రతి గ్రామ పంచాయతీలోనూ పనులు జరగాలన్నారు. జలధార కింద ప్రతి మండలానికి 100 పనులు లక్ష్యం పెట్టుకుని మంజూరులు తీసుకోవాలని, ప్రతి గ్రామపంచాయతీలోనూ ఎనిమిది పనులు ప్రతిపాదనలు పెట్టి మంజూరులు తీసుకోవాలని, సంబంధిత ఎంపీడీవోలు, ఏపీవోలు 15 రోజుల్లో పనులు గుర్తించి మంజూరులను తీసుకోవడం పూర్తి చేయాలని, ఏరియా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలన్నారు. ఈ విషయమై ప్రతిరోజు సాయంత్రం సంబంధిత ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ తీసుకోవాలని డ్వామా పీడిని ఆదేశించారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలకు సంబంధించి ఐవిఆర్ఎస్ కాల్స్ లో వెనుకబడిన 10 మండలాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, పెండింగ్ ఉన్న సిటిజన్ ఈకెవైసి పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, పద్మావతి, డ్వామా పిడి సలీమ్ భాష, డిపిఓ నాగరాజునాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్చంద్, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, వయోజన విద్య ఉపసంచాలకులు వెంకటేశ్వర్లు, జిల్లా స్వర్ణ గ్రామ వార్డు కార్యాలయాల అధికారి నాసర రెడ్డి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గోకులం చిత్రం ఘనంగా ప్రారంభం..



- కాలాన్ని జయించేది శక్తి కాదు- సృజన మాత్రమే.
- తర తరాలు మారినా నిలిచిపోయేది ఆలోచనే.
- ఆ ఆలోచనకు రూపమే గొప్ప సినిమా గోకులం.
- దర్శక,నిర్మాతలు నాయన గారి నరసింహారెడ్డి, ప్రదీప్ మామిడి మాల్యాద్రి.

**ధర్మవరం జూలై 27, అనంత జనశక్తి న్యూస్:**

మైథాలజీ, జానపదం, టైమ్ ట్రావెల్ వంటి విభిన్న కథా ప్రపంచాలను ఒకే దృశ్యకావ్యంలో మేళవించి, తెలుగు ప్రేక్షకులకు ఎన్నడూ చూడని సినీ అనుభూతిని అందించాలనే సాహసోపేత సంకల్పంతో రూపొందుతున్న చిత్రం "గోకులం." ఈ తరహా కథను వెండితెరపై ఆవిష్కరించడం ఒక సవాలు మాత్రమే కాదు, సృజనాత్మకతకు నిదర్శనం కూడా అని, సాధారణ కథను చెప్పడం ఒక కళ అయితే, కాలాన్ని కథానాయకుడిగా మలిచి గతం, వర్తమానం, భవిష్యత్తును ఒకే కథలో అల్లడం అసాధారణ ప్రతిభకు నిదర్శనం. అలాంటి వినూత్న ఆలోచనతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్న దర్శకుడు ప్రదీప్ మామిడి మాల్యాద్రి నిజంగా అభినందనీయులు. కొత్త తరహా కథలతో తెలుగు సినీ పరిశ్రమకు మరో విలువైన చిత్రాన్ని అందించాలనే ఆయన సంకల్పం ప్రశంసనీయం.

ఒక గొప్ప సినిమా వెనుక కేవలం కళాకారుల శ్రమ మాత్రమే ఉండదు. ఎన్నో కలలు, ఎన్నో త్యాగాలు, ఎన్నో నమ్మకాలు, ఎన్నో సంవత్సరాల ఆలోచన, పరిశోధన, ప్రణాళిక దాగి ఉంటాయి. అలాంటి మహత్తర ప్రయాణంలో ప్రతి అడుగును విశ్వసిస్తూ, ఎలాంటి వెనుకడుగు వేయకుండా ఈ చిత్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న నిర్మాతకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, సృజనను విశ్వసించి పెట్టుబడి పెట్టే నిర్మాతలే గొప్ప సినిమాలకు బలమైన పునాది.

ఈ చిత్రానికి ఆత్మగా నిలిచే కథను అందించిన నాయనగారి నరసింహ రెడ్డి కూడా ప్రత్యేక అభినందనలకు అర్హులు. బలమైన కథ, దూరదృష్టి కలిగిన దర్శకత్వం, నిబద్ధతతో కూడిన నిర్మాణం కలిసొస్తేనే ఒక చిత్రం ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తుంది.

తెలుగు సినిమా నేడు ప్రపంచవ్యాప్తంగా తన ప్రత్యేక గుర్తింపును చాటుకుంటోంది. అలాంటి సమయంలో కొత్త ఆలోచనలు, వినూత్న కథాంశాలు, అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందే చిత్రాలు పరిశ్రమ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయి. "గోకులం" కూడా ఆ కోవలో నిలిచి తెలుగు సినీ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదిస్తుందని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.

ఈ చిత్రం ప్రేక్షకులకు వినోదంతో పాటు ఆలోచనను రేకెత్తించే అనుభూతిని అందించి, విమర్శకుల ప్రశంసలు, ప్రేక్షకుల ఆదరణతో ఘనవిజయాన్ని సొంతం చేసుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామని, దర్శకుడు ప్రదీప్ కి, నిర్మాతకు, కథా రచయిత నరసింహ రెడ్డి కి, నటీనటులకు, సాంకేతిక నిపుణులకు, అలాగే మొత్తం చిత్రబృందానికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు అని, "గోకులం" తెలుగు సినీ పరిశ్రమలో చిరస్మరణీయ విజయంగా నిలిచి, సృజనాత్మక చిత్రాలకు సరికొత్త ప్రమాణంగా అవతరించాలని ఆశీర్వదిస్తున్నామని ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ప్రభుత్వాధికారులు పెద్దలు తెలియజేశారు .ఈ సినిమా ప్రారంభోత్సవంలో కెమెరా స్విచ్ ఆన్ అరుణ్ బాబు సిబిఐ, ఈ. జగన్నాథ రెడ్డి మాజీ జిల్లా జడ్జి చేయగా, క్లాపు కొట్టి జస్టిస్ సివి రాములు మాజీ లోకాయుక్త ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ నాయనా గారి నరసింహా రెడ్డి దర్శకులు ప్రదీప్ మామిడి మాల్యాద్రి, క్రియేటివ్ డైరెక్టర్ మహేష్ కోడలి, ఆర్ ఎం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులకు అండగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు..

- రూ.188 కోట్లతో ధరల లోటు భర్తీ
- 94 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుకు.. కిలోకు రూ.20 ఇచ్చేందుకు నిర్ణయం
- రూ.15 కేంద్రం.. రూ.5 రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సంసిద్ధత
- రైతులకు నష్టం కలగకుండా పొగాకు ధరలు స్థిరీకరిస్తాం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, జూలై 27:అనంత జనశక్తి న్యూస్**

పొగాకు రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పొగాకు ధరల స్థిరీకరణతో పాటు రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సుమారు రూ.188 కోట్ల వరకు భరించేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. సోమవారం పొగాకు రైతులకు మెరుగైన ధరలు అందేలా కొనుగోళ్లను వేగవంతం చేయడం, ధరల స్థిరీకరణ, రైతులకు ధరల లోటు భర్తీ వంటి అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, టుబాకో బోర్డు, మార్కెటింగ్ శాఖ అధికారులు, బయ్యర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.పొగాకు రైతులను ఆదుకునే ఉద్దేశంతో 94 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేయాలని నిర్ణయించామని మంత్రి తెలిపారు. ధరల లోటు భర్తీ కింద రైతులకు కిలో పొగాకుకు రూ.20 చొప్పున అందించాలని నిర్ణయించామని, ఇందులో రూ.15 కేంద్ర ప్రభుత్వం, రూ.5 రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సంసిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పొగాకు రైతుల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో ఎక్కడా రాజీపడవద్దని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. బ్రైట్ రకం పొగాకు కిలో రూ.240, మీడియం రకం పొగాకు కిలో రూ.190, లో గ్రేడ్ పొగాకు కిలో రూ.110 మేర ధరలు తగ్గకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని తెలిపారు. పొగాకు రైతుల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి అన్నారు. రెండు రోజుల క్రితం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, డైరెక్టర్ ముఖ్యమంత్రిని కలిసి పొగాకు మార్కెట్ పరిస్థితులపై చర్చించారని తెలిపారు. సీఎం సూచనల మేరకు పొగాకు రైతులను ఆదుకునేందుకు సహకరించాలని కోరుతూ కేంద్ర ప్రతినిధులు రాష్ట్రంలోని బయ్యర్లతో కూడా చర్చలు జరిపారని చెప్పారు.పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. రైతులకు నష్టం కలగకుండా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుంది. పొగాకు మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు మెరుగైన ధరలు లభించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. రైతుల సంక్షేమం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదు అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



# టీడీపీలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల కోసం హోరాహోరీ పోటీ

(మొదటిపేజీ తరువాయి)

శాసనమండలిలో జూలై 28తో గవర్నర్ నామినేటెడ్ ఎమ్మెల్సీలు జకియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీకాలం ముగియనుండటంతో ఆ రెండు స్థానాలను భర్తీ చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ విస్తృత స్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

**సామాజిక సమీకరణాలే కీలకం**

అభ్యర్థుల ఎంపికలో సామాజిక, ప్రాంతీయ, రాజకీయ సమీకరణాలకు అధిష్ఠానం ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో పార్టీ కోసం సీట్లు త్యాగం చేసిన నాయకులు, రాజ్యసభ అవకాశం కోల్పోయిన సీనియర్లు, పార్టీకి దీర్ఘకాలంగా సేవలందించిన నేతలకు ప్రాధాన్యం దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి భారీ పోటీ**

ఆశావహుల జాబితాలో ఉమ్మడి కృష్ణా జిల్లా నేతలే ఎక్కువగా ఉన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, వంగవీటి రాధాకృష్ణ, టీడీ జనార్దన్, గొట్టిపాటి రామకృష్ణ, బుద్ధా వెంకన్న పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరంతా పార్టీ అధిష్ఠానాన్ని కలిసి తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.

**రాయలసీమకు ఒక స్థానం?**

రెండు స్థానాల్లో ఒకటి రాయలసీమకు కేటాయించే



అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ప్రాంతం నుంచి రెడ్డప్పగారి శ్రీనివాస్ రెడ్డి, తిప్పేస్వామి, బీటెక్ రవి, ప్రభాకర్ చౌదరి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇతర సామాజిక వర్గాల నుంచి కూడా పోటీ**

**గోదావరి జిల్లాకు చెందిన క్షత్రియ సామాజిక వర్గ నేత మంతెన సత్యనారాయణరాజు మరోసారి ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. వికలాంగుల కోటాలో అవకాశం ఇవ్వాలని గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బ్రాహ్మణ కోటాలో ఏవీ రమణ కూడా తన పేరును పరిశీలించాలని కోరుతున్నారు.**

**అదేవిధంగా డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, మోపిదేవి వెంకట రమణారావు, కొమ్మాలపాటి శ్రీధర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, మంగళగిరి సీనియర్ నేత పోతినేని శ్రీనివాసరావు కూడా ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్న వారి జాబితాలో ఉన్నారు.**

**అధిష్ఠానం నిర్ణయంపైనే అందరి దృష్టి**

**ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ తుది నిర్ణయం తీసుకోనున్నారు. పార్టీకి చేసిన సేవలు, సామాజిక సమతుల్యత, ప్రాంతీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఎవరిని వరించనున్నాయన్న ఉత్కంఠ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.**

# ప్రతి గడప...గడపకు తెలుగుదేశం





**- 38వ వార్డులో ప్రజా పాలనకు సంపూర్ణ మద్దతు కార్యక్రమం.**
**- ప్రజా మద్దతుతో ముందుకు సంధా రాఘవ....**

**ధర్మవరం జులై 27 అనంత జనశక్తి న్యూస్ :**

పట్టణంలోని 38వ వార్డులో ఇంటింటికీ తెలుగుదేశం నాయకులు ప్రజలతో మమేకమై ప్రతి ఇంటి గడప తొక్కుతూ ధర్మవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తున్న యువ నాయకుడు సంధా రాఘవ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.

ఈ సందర్భంగా సంధా రాఘవ మాట్లాడుతూ.... సూపర్ సిక్స్ హామీలతో పాటు మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, చేనేత కార్మికులు, వృద్ధులు, దివ్యాంగులు, పేద కుటుంబాల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం "తల్లికి వందనం" ద్వారా విద్యార్థుల విద్యకు ప్రోత్సాహం, "అన్నదాత సుఖీభవ"తో రైతులకు ఆర్థిక చేయూత, మెగా డీఎస్సీ, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, "దీపం" పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు పేదలకు పక్కా ఇళ్లు, సంక్షేమ పథకాలు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెరిగిన పింఛన్లు చేనేత కార్మికులకు ప్రత్యేక ప్రోత్సాహం ప్రతి వర్గానికీ సంక్షేమం ప్రతి ప్రాంతానికీ అభివృద్ధి ప్రజల విశ్వాసమే బలం కార్యకర్తలే కుటుంబం ప్రజాసేవే లక్ష్యంగా సంధా రాఘవ ముందుకు సాగుతున్నారు.

ప్రజల కోసం పేదల కోసం అభివృద్ధి కోసం మాట ఇచ్చిన ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం

సంధా రాఘవతో బలోపేతమవుతున్న తెలుగుదేశం సంక్షేమం, అభివృద్ధితో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం 38వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శీలా మూర్తి, కొత్తపేట ఆది, జింకా పురుషోత్తం, వాసుదేవ, మనోహర్ ఆచారి, జింకల రాజన్న, మహిళా నాయకురాలు స్వర్ణ, మున్ని, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సందడి



**- విద్యార్థులతో కలిసి క్రీడల్లో పాల్గొని ఉత్సాహపరిచిన ఎమ్మెల్యే దగ్గుపాటి**

**అనంతపురం జూలై 27, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్-2026 కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వివిధ క్రీడా అంశాల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. ప్రతి విద్యార్థి క్రీడలను జీవితంలో భాగంగా చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు అమరావతి ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విద్యార్థులతో కలిసి క్రీడల్లో పాల్గొనడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, క్రీడా ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన "గోకులం" చిత్రం



**- ముహూర్తపు షాట్‌తో ప్రారంభమైన చిత్రీకరణ...**
**- చిత్రబృందానికి మాజీ లోకాయుక్త జస్టిస్ సి.వి. రాములు శుభాకాంక్షలు...**

**ధర్మవరం, జూలై 27, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణంలో సోమవారం సినీ సందడితో కళకళలాడింది. మైథాలజీ, జానపదం, టైమ్ ట్రావెల్ అంశాలను సమన్వయం చేస్తూ వినూత్న కథాంశంతో రూపొందుతున్న "గోకులం" చిత్రం ముహూర్తపు షాట్‌తో ఘనంగా ప్రారంభమైంది. చిత్రీకరణ ప్రారంభోత్సవ వేడుకకు సినీ, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన పలువురు హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మాజీ లోకాయుక్త జస్టిస్ సి.వి. రాములు పాత్రికేయులకు అందించిన సందేశంలో చిత్రబృందాన్ని అభినందిస్తూ, సినిమా అనేది కేవలం వినోద మాధ్యమం మాత్రమే కాదని, సమాజాన్ని ఆలోచింపజేసే గొప్ప సృజనాత్మక శక్తి అని పేర్కొన్నారు.

"కాలాన్ని జయించేది శక్తి కాదు సృజన మాత్రమే. తరాలు మారినా నిలిచిపోయేది ఆలోచనే

ఆ ఆలోచనకు రూపమే గొప్ప సినిమా" అని ఆయన పేర్కొన్నారు.

మైథాలజీ, జానపదం, టైమ్ ట్రావెల్ వంటి విభిన్న కథా ప్రపంచాలను ఒకే దృశ్యకావ్యంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ప్రయత్నం ఎంతో సాహసోపేతమైందని కొనియాడారు. సాధారణ కథను చెప్పడం ఒక కళ అయితే, గతం వర్తమానం భవిష్యత్తును ఒకే కథలో మేళవించి కాలాన్నే కథానాయకుడిగా మలచడం అసాధారణ సృజనాత్మకతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

దర్శకుడు ప్రదీప్ వినూత్న ఆలోచనతో ఈ చిత్రాన్ని తెరకెక్కించడం అభినందనీయమని, తెలుగు సినీ పరిశ్రమకు మరో విలువైన చిత్రాన్ని అందించాలనే ఆయన సంకల్పం ప్రశంసనీయమని తెలిపారు.

అలాగే, ఒక గొప్ప సినిమా వెనుక కళాకారుల శ్రమతో పాటు ఎన్నో కలలు, త్యాగాలు, పరిశోధన, ప్రణాళిక, నమ్మకం దాగి ఉంటాయని పేర్కొన్నారు. అలాంటి సృజనాత్మక ప్రయాణాన్ని విశ్వసించి నిర్మాణ బాధ్యతలను చేపట్టిన నిర్మాత ప్రత్యేక అభినందనలకు అర్హులని అన్నారు. సృజనను విశ్వసించి పెట్టుబడి పెట్టే నిర్మాతలే గొప్ప చిత్రాలకు బలమైన పునాదిగా నిలుస్తారని చెప్పారు.

చిత్రానికి కథ అందించిన నరసింహారెడ్డిని ప్రత్యేకంగా అభినందించిన జస్టిస్ రాములు, బలమైన కథ, దూరదృష్టి గల దర్శకత్వం, నిబద్ధతతో కూడిన నిర్మాణం కలిసొస్తేనే ఒక చిత్రం ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

తెలుగు సినిమా ప్రపంచవ్యాప్తంగా తన ప్రత్యేక గుర్తింపును చాటుకుంటున్న ప్రస్తుత తరుణంలో, కొత్త ఆలోచనలు, వినూత్న కథాంశాలు, అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందే చిత్రాలు పరిశ్రమ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని అన్నారు. "గోకులం" కూడా అలాంటి చిత్రాల సరసన నిలిచి తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

చిత్రం ప్రేక్షకులకు వినోదంతో పాటు ఆలోచనను రేకెత్తించే అనుభూతిని అందించి, విమర్శకుల ప్రశంసలు, ప్రేక్షకుల ఆదరణతో ఘన విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. దర్శకుడు ప్రదీప్, నిర్మాత, కథా రచయిత నరసింహారెడ్డి, నటీనటులు, సాంకేతిక నిపుణులు, మొత్తం చిత్రబృందానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ధర్మవరం నుంచి ప్రారంభమైన ఈ సినీ ప్రయాణం తెలుగు సినీ పరిశ్రమలో చిరస్మరణీయ విజయంగా నిలిచి, సృజనాత్మక చిత్రాలకు సరికొత్త ప్రమాణంగా అవతరించాలని ఆకాంక్షించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల వేళ ముదిగుబ్బ మండలంలో వైసిపికి షాక్



**- మర్తాడు పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు టిడిపిలోకి చేరికలు**
**- ధర్మవరం టిడిపి ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో చేరికలు**
**- రెండేళ్ల పాలనలో జరిగిన కార్యక్రమాలు చూసి పార్టీలోకి వస్తున్నారన్న శ్రీరామ్**

**ధర్మవరం జూలై 27 అనంత జనశక్తి న్యూస్**

స్థానిక సంస్థల ఎన్నికల వేళ ధర్మవరం నియోజకవర్గం, ముదిగుబ్బ మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. మర్తాడు పంచాయతీ ఎస్.బండ్లపల్లికి చెందిన పలువురు వైసిపి నాయకులు ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన జె.నారాయణస్వామి, జే.ఆదినారాయణ, పి.ఆది నారాయణ, చిన్న నారాయణ, నడిపి నారాయణ, జే.అదెప్ప, పి.నారాయణస్వామితో పాటు మొత్తం 38 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో శ్రీరామ్ వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మనోహర్, ఎస్.బండ్లపల్లి గ్రామ స్థానిక నాయకులు అంకె కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి వచ్చినట్లు నాయకులు తెలిపారు. పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కోసం ఇక నుంచి కష్టపడి పని చేస్తామని వారు తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో సొంత పార్టీ నాయకులకు కూడా న్యాయం జరిగిన పరిస్థితి లేదన్నారు. అందుకే చాలామంది నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యత ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు.....

# ఆకివీడులో రామాలయ నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

ఈ వివాదానికి సంబంధించి.. గతంలో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిరభ్యంతర పత్రం చట్టబద్ధమైనదేనని సుప్రీం కోర్టు పేర్కొంది. ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు లోబడి ఆలయ నిర్మాణం చేపట్టడంలో ఎలాంటి తప్పులేదని వెల్లడించింది. ఆలయ నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌లో ఎటువంటి సత్యాలు లేవని కోర్టు పేర్కొంది. పిటిషన్‌ను తోసిపుచ్చింది. కలెక్టర్ ఇచ్చిన ఎన్‌ఓసీ సరైనదేనని, దానిలో ఎలాంటి చట్ట ఉల్లంఘన జరగలేదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలో రామాలయాన్ని నిర్మించడంలో ఎలాంటి అభ్యంతరం లేదని కోర్టు వెల్లడించింది. సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆకివీడులో రామాలయ నిర్మాణానికి మార్గం సుగమమైంది. న్యాయస్థానం తీర్పుతో స్థానిక ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు సుప్రీం కోర్టు తీర్పుపై సంతోషం వ్యక్తం చేశారు.

'ఆకివీడులో రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్! రామాలయ నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది! సత్యం గెలిచింది! ధర్మం గెలిచింది! శ్రీ రాముడు గెలిచాడు!! జై శ్రీ రామ్!' అని రఘురామ కృష్ణ రాజు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ప్రజా పాలనకు సంపూర్ణ మద్దతు లభిస్తోంది



**- ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్**
**- పోతులనాగేపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన పరిటాల శ్రీరామ్**
**- పథకాల విషయంలో ప్రజల సంతృప్తి.. పలు సమస్యలపై విజ్ఞప్తులు**

**ధర్మవరం జూలై 27 అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం మండలం పోతులనాగేపల్లిలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి.. రెండేళ్లలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పథకాల విషయంలో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల పింఛన్లు, తల్లికి వందనం పథకంకి సంబంధించిన కొన్ని సమస్యలను శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వాటి గురించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. గ్రామంలో సమస్యల గురించి కూడా శ్రీరామ్ అడిగి తెలుసుకున్నారు. రెండేళ్లలో తమకు పథకాలు బాగా అందాయని.. పాలన కూడా బాగుందన్న అభిప్రాయం కనిపించింది. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ రెండేళ్లలో తాము చేసిన వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కేవలం చేసింది మాత్రమే చెప్పకుండా సమస్యల గురించి కూడా అడిగి తెలుసుకుంటున్నామన్నారు. 45రోజుల పాటు మా పార్టీ శ్రేణులు మొత్తం ప్రజల్లోనే ఉంటామన్నారు. ప్రతి ఇంటిని, ప్రతి ఓటర్ ను కలుసుకుంటామన్నారు. ప్రజల్లో మా పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సుమారు 10లక్షల కోట్లకు పైగా అప్పు ఉన్న రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి వైపు నడిపించడం అంత సులువైంది కాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రంలో ఓ వైపు సంక్షేమ కార్యక్రమాలు ఇస్తూ.. ఇంకోవైపు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తున్నారని.. లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అందుకే ప్రజలు తమ పాలనకు మద్దతు చెబుతున్నారని శ్రీరామ్ అన్నారు...

# ఉద్యాన పంటల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట



**- రైతులు ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం పొందాలి: ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

**కదిరి , జూలై 27:అనంత జనశక్తి న్యూస్**

రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం వ్యవసాయం, ఉద్యానవన రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు.కదిరి రూరల్ మండలం ఎగువపల్లి పంచాయతీ పరిధిలోని ఎగువపల్లి గ్రామంలో వికసిత్ భారత్ – ఉపాధి, జీవనోపాధి హామీ (గ్రామీణ) కార్యక్రమంలో భాగంగా రైతు సుధాకర్ నాయుడు పొలంలో నిర్వహించిన ఉద్యాన పండ్ల తోటల మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండ్ల తోటల విస్తరణ, ఆధునిక సాగు పద్ధతులు, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే చర్యల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా బలోపేతం కావచ్చని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని రైతులకు సూచించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం, ఉపాధి కల్పన, గ్రామీణాభివృద్ధికి పలు కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చెంచయ్య నాయుడు, ఉద్యానవన శాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 2ఏళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం



**- రెండేళ్ల సుపరిపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం**
**- ఇంటింటి ప్రచార కార్యక్రమము**

**అగళి జూలై 27,అనంత జనశక్తి న్యూస్:**

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండేళ్ల సుపరిపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వారి ఆదేశాల మేరకు మడకశిర నియోజకవర్గంలోని అగళి మండలంలో హళ్లికేరా పంచాయతీలోని హళ్లికేరా, హళ్లికేరా గొల్లహట్టి, ముతేపల్లి గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పీటీసీ వి ఉమేష్, మండల అధ్యక్షులు తిప్పేస్వామి, సింగల్ విండో అధ్యక్షుడు కుమారస్వామి, క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ మూర్తి, కొ కన్వినర్ కమ్మరి శివన్న, మాజీ ఎంపిపి బసవరాజు, మాజీ ఎంపిపి ఇనగలూరు నరసింహప్ప, మాజీ మండల ప్రధాన కార్యదర్శి జయరాం, మండల ప్రధాన కార్యదర్శి డి.విశ్వనాథ్ యాదవ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ కేంచయాదవ్, తెదేప నాయకులు గురుమూర్తి, హళ్ళికేర రామన్న, వేణుగోపాల్, నింగరాజు స్థానిక టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు మరియు ప్రజా ప్రయోజన కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణి చేసి ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, వారి సమస్యలను వినిపించుకుని, పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల ఆదరణ మధ్య కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందన్నారు.

# మీరు మీలా ఉంటే.. చాలు: నటి రష్మిక




చిత్రసీమలో దక్షిణాది నుంచి ఉత్తరాది వరకూ.. కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ వైవిధ్యమైన పాత్రలతో సినీప్రియుల్ని అలరిస్తోంది అందాల తార రష్మిక. అగ్రతారల సరసన అవకాశాలను అందిపుచ్చుకుంటూనే నాయికా ప్రాధాన్య చిత్రాలను తన ఖాతాలో వేసుకుంటుంది. పాన్ ఇండియా స్థాయిలో కథానాయికగా సత్తా చాటుతున్న ఈ భామ ఇటీవల ఓ కార్యక్రమంలో తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. "ఏ మూస పద్ధతిలోనూ ఇమడకుండా పూర్తిగా కొత్త చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం నా జీవితంలోని అద్భుతమైన ప్రయాణం. ఆ సమయంలో నా చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరికీ ఓ ప్రణాళిక ఉండేది. అందుకే నాకు మొదట్లో భయంగా అనిపించింది. కానీ, నేను నా అంతరాత్మ చెప్పిందే అనుసరించేదాన్ని. కెరీర్‌లో ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అదే నా ప్రయాణాన్ని ప్రత్యేకంగా నిలిపిందని అనిపిస్తుంది. మనల్ని ఇతరుల నుంచి భిన్నంగా చూపే విషయాలే మనకు అతిపెద్ద బలం అని తెలుసుకున్నాను. అందరిలో కలిసిపోవాలనుకుని.. వారితో ప్రతి విషయంలోనూ ఇమిడిపోవాల్సిన అవసరం లేదు. మీరు మీలా ఉంటే చాల"ని చెప్పుకొచ్చింది.

# మనల్ని మనం చూసుకునే విధానమే.. అసలైన విజయం




తననొక మూస పద్ధతిలో చూపించడాన్ని సహించలేనంటోంది బాలీవుడ్ కథానాయిక హ్యూమా ఖురేషి. ఇటీవలే 'బేబీ డు డై డు' నాయికా ప్రాధాన్య సినిమాతో థియేటర్లలో సందడి చేసిందీ తార. త్వరలోనే యశ్ 'టాక్సిక్' చిత్రంలో కనిపించనుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో హ్యూమా మాట్లాడుతూ.. "కెరీర్ ప్రారంభంలో ప్రేక్షకులందరికి నేను తెలియాలనుకున్నా. కానీ ఈరోజు నేను చేసే పని, దానికి సహకరించే వారిని ఎంచుకోవడం.. నచ్చని పాత్రలకు నో అని చెప్పగలగడమే అసలైన విజయమని తెలుసుకున్నా. నటిగా మనల్ని మనం చూసుకునే విధానమే నా దృష్టిలో సక్సెస్. అందుకే నన్నొక మూస పద్ధతిలో చూపించడాన్ని సహించలేను. ఒక నటిగా నేను చేయగలిగేది చాలా ఉంది. అలా అని ఒక పనిని చాలా బాగా చేయగలనని, అవకాశం ఇవ్వమని ఎవ్వరినీ బలవంతం చేయను. నాకు వచ్చే అవకాశాలను మాత్రమే సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తా. ఒకే ఏడాదిలో రెండు వైవిధ్యమైన పాత్రలు చేయగలననే విషయంలో నేను చాలా గర్వపడతాను. నటిని కాబట్టి నా వయసు మార్చుకోగలను, తగ్గించుకోగలను. ఏమైనా చేయగలను. ఇతరుల ఆలోచనలు, అంచనాలు అనే సంకెళ్ల నుంచి మాత్రం విముక్తి పొందాలనుకుంటున్నా" అని అంది.




# నాయికలతోనే ఆ మార్పు రాదు

"వెండితెరపై మహిళా ప్రాధాన్య పాత్రల్లో నిజమైన మార్పు రావాలంటే కేవలం నటీమణుల వల్ల మాత్రమే రాదు. చిత్ర పరిశ్రమలో ఇతర విభాగాల్లోనూ మహిళల సంఖ్య పెరగాల"ని అంటోంది కథానాయిక మాళవిక మోహనన్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. కమర్షియల్ సినిమాల్లో మహిళలకు విభిన్నమైన పాత్రలు రాకపోవడానికి గల కారణాల గురించి ఆసక్తికరమైన విషయాలు పంచుకుంది. "వాస్తవానికి సినీ పరిశ్రమలో మనకు ఎక్కువ మంది మహిళా దర్శకులు, రచయితలు లేరు. మహిళా దర్శకులు కూడా కేవలం కొద్దిమంది మాత్రమే ఉన్నారు. ఎప్పుడైతే ఫీమెల్ మేకర్స్ ఎక్కువగా ఉంటారో అప్పుడే నటీమణులకు కూడా యాక్షన్ పాత్రల్లో నటించే అవకాశాలు వస్తాయని నేను కచ్చితంగా చెప్పగలను. నిజం చెప్పాలంటే గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. హాలీవుడ్ యాక్షన్ చిత్రం 'కిల్ బిల్' తరహాలో నటించడమనేది నా కల" అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం మాళవిక మోహనన్ 'సర్దార్ 2', 'పాకెట్ నావెల్' చిత్రాలతో బిజీగా ఉంది.

# రామ్‌చరణ్ మణికట్టుకు నేడు శస్త్రచికిత్స

ప్రముఖ కథానాయకుడు రామ్‌చరణ్‌కు నేడు కోయంబత్తూర్ నగరంలోని ఓ ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరగనుంది. 'పెద్ది' సినిమా చిత్రీకరణలో ఆయనకు మణికట్టు బెణికి తీవ్ర గాయమైంది. ఒకవైపు చికిత్స పొందుతూనే, మరోవైపు ఆ సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి శస్త్రచికిత్స ఒక్కటే పరిష్కారమని వైద్యులు సూచించినట్టు సమాచారం. దాంతో కోయంబత్తూరులోని ఓ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు రామ్‌చరణ్. అందుకోసం ఆదివారం హైదరాబాద్ నుంచి కోయంబత్తూరుకు బయల్దేరి వెళ్లారు. రామ్‌చరణ్‌పాటుగా ఆయన భార్య ఉపాసన, తల్లిదండ్రులు చిరంజీవి, సురేఖ కూడా ఉన్నారు. 'పెద్ది' చిత్రీకరణలోనే రెండుసార్లు గాయపడ్డారు రామ్‌చరణ్. మొదట నుదుటిపై గాయం కాగా, హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నారు. రామ్‌చరణ్ తదుపరి చిత్రం సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా చిత్రీకరణ దలయ్యేలోపు గాయాల నుంచి పూర్తిగా కోలుకోవాలనే లక్ష్యంతో ఉన్నారు రామ్‌చరణ్.




# భారత క్రికెట్‌కు నూతన వైభవం.. జట్టులో కుదురుకున్న సూర్యవంశీ




1989లో 16 ఏళ్ల కుర్రాడొకడు నీలి రంగు భారత క్రికెట్ జెర్సీ వేసుకుని మైదానంలోకి అడుగుపెట్టాడు. ఆ వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేయడమే ఒక ఎత్తైతే.. అద్భుతమైన ఆటతీరుతో క్రికెట్ ప్రపంచాన్ని ఊపేయడం ఇంకో ఎత్తు. కాల క్రమంలో ఆ కుర్రాడు ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా పేరు సంపాదించాడు. ఈ ఉపోద్ఘాతమంతా సచిన్ తెందుల్కర్ గురించే అని ఈపాటికే అర్థమై ఉంటుంది. ఇటీవలే భారత జట్టుకు ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా సచిన్ రికార్డును బద్దలు కొట్టిన వైభవ్ సూర్యవంశీ.. కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాడు. అతను అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగు పెట్టడానికి ముందే మాస్టర్ బ్లాస్టర్‌ను మించి క్రేజ్ సంపాదించి.. తన అరంగేట్రం గురించి క్రికెట్ ప్రపంచమంతా మాట్లాడుకునేలా చేశాడు. అరంగేట్ర సిరీస్‌లో తడబడ్డప్పటికీ.. ఇప్పుడు జింబాబ్వే పర్యటనలో నిలకడగా రాణించి తన ముద్రను చాటాడు. 16 ఏళ్ల 205 రోజులు.. 1989లో అంతర్జాతీయ అరంగేట్రం చేసినప్పటికి సచిన్ తెందుల్కర్ వయసు ఇది. అంత చిన్న వయసులో సచిన్ భారత జట్టుకు ఆడటం చూసి అప్పుడు అందరూ అబ్బురపడ్డారు. భారత్ తరపున అతి పిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్ ఆడిన ఆటగాడిగా 37 ఏళ్ల పాటు ఆ రికార్డు నిలిచి ఉంది. ఇప్పుడు వైభవ్ ఆ రికార్డును పెద్ద తేడాతో బద్దలు కొట్టేశాడు. వైభవ్ 15 ఏళ్ల 99 రోజుల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ ఆడడం విశేషం. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ20 సిరీస్‌లకు ఎంపికైన అతను.. ఐర్లాండ్‌లో అవకాశం దక్కించుకోలేకపోయాడు. అక్కడే తన అరంగేట్రం జరుగుతుందని అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూడగా.. అది జరగలేదు. ఇంగ్లాండ్‌తో తొలి టీ20లోనూ వైభవ్ ఆడకపోవడంతో మరోసారి నిరాశే ఎదురైంది. అయితే, వరుసగా మూడు టీ20ల్లో సంజు శాంసన్ విఫలం కావడంతో వైభవ్‌కు అవకాశం ఇవ్వక తప్పలేదు. ఇంగ్లాండ్ రెండో టీ20లో వైభవ్ తుది జట్టులో అడుగు పెట్టాడు.

ఐతే ఆ సిరీస్‌లో వరుసగా మూడు ఇన్నింగ్స్‌ల్లో 14, 13, 15 పరుగులే చేయడంతో వైభవ్ మీద విమర్శలు తప్పలేదు. తన సామర్థ్యం మీద సందేహాలు తలెత్తాయి. ఇండియాలోని ఫ్లాట్ పిచ్‌లపై మాత్రమే రాణించగలడా అన్న చర్చ జరిగింది. కానీ జింబాబ్వే పర్యటన రూపంలో దక్కిన మరో అవకాశాన్ని అతను పూర్తిగా ఉపయోగించుకున్నాడు. తొలి టీ20లో తనదైన శైలిలో మెరుపులు మెరిపిస్తూ 19 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. రెండో టీ20లో 20 పరుగులకు ఔటైన అతను.. మూడో మ్యాచ్‌లో 49 బంతుల్లో 81 పరుగులతో ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అడ్డదిడ్డంగా షాట్లు ఆడేయకుండా సంయమనం పాటించిన వైభవ్.. పరిస్థితులకు తగ్గట్లు ఆడి తన పరిణతిని చాటాడు. తనకు అంతర్జాతీయ క్రికెట్లో తొలి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది ఈ మ్యాచ్‌లోనే. అంతే కాదు.. అతను 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డునూ దక్కించుకున్నాడు.

అరంగేట్రానికి ముందే స్టార్

టీమ్ఇండియా లోకి వైభవ్ రాకతో భారత క్రికెట్లో నవశకం మొదలైనట్లే. ఆటలో వైభవ్ ఏ స్థాయికి ఎదుగుతాడన్నది భవిష్యత్ నిర్ణయిస్తుంది కానీ.. అరంగేట్రం చేయడానికి ముందే అతను భారత క్రికెట్లో పెద్ద స్టార్ అయిపోయాడు. కెరీర్ మొదలుపెట్టకముందే భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించాడు. గత ఏడాదిన్నర కాలంలో అతడి పేరు అంతగా మార్మోగింది మరి. ప్రస్తుత భారత టీ20 జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ లాంటి స్టార్లు ఉన్నా.. వారిని మించిన స్టార్ ఇమేజ్‌ను అరంగేట్రానికి ముందే వైభవ్ సాధించేశాడంటే అతిశయోక్తి కాదు. క్రికెట్ మ్యాచ్‌ల మోతాదు బాగా ఎక్కువైపోయి... జనాలకు మొహం మొత్తేసిన పరిస్థితులను కొన్నేళ్లుగా చూస్తున్నాం. ఇంతకుముందులా మ్యాచ్‌లను ఆద్యంతం ఆసక్తిగా చూడడం తగ్గిపోతోంది. అందులోనూ విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టెస్టులు, టీ20లకు దూరం కావడంతో ఆ ఫార్మాట్లలో భారత క్రికెటర్ల ఆట చూడాలని అభిమానులు తహతహలాడడే రోజులు ఇప్పుడు లేవు.

టెస్టులకు ఆదరణ బాగా తగ్గిపోయింది. టీ20ల కోసం స్టేడియాలకు జనం వస్తున్నారు కానీ.. టీమ్ ఇండియాకు మునుపటి ఆకర్షణ లేదన్నది మాత్రం వాస్తవం. అభిషేక్ శర్మకు కొంత ఫాలోయింగ్ ఉంది కానీ.. కోహ్లి, రోహిత్ లకు అతను దరిదాపుల్లో ఉండడు. ఇలాంటి టైంలో వైభవ్ సూర్యవంశీ.. రో-కో తరహాలోనే తన కోసం స్టేడియాలకు అభిమానులను రప్పించే ఆటగాడవుతాడనే అంచనాలు నెలకొన్నాయి. ఈ ఐపీఎల్‌లో వీర విధ్వంసంతో ఆ స్థాయిలో ఫాలోయింగ్ సంపాదించాడు వైభవ్. నిజానికి గత సీజన్లతో పోలిస్తే ఈ ఐపీఎల్ అంత హోరాహోరీగా, ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా సాగలేదు. అయినా లీగ్ ఆకర్షణ తగ్గకుండా చూడడంలో వైభవ్ పాత్ర కీలకం. 13 ఏళ్లకే ఐపీఎల్ వేలంలో రూ1.1 కోట్లు దక్కించుకున్నపుడు ఆ వయసు పిల్లాడిని వేలంలో కొనడమేంటి, అదీ అంత రేటుగా అని చాలామంది తేలిగ్గా మాట్లాడారు. కానీ నిరుడు 14 ఏళ్ల వయసులోనే వైభవ్ ఐపీఎల్ అరంగేట్రం చేయడమే కాక 38 బంతుల్లో మెరుపు శతకం బాది ఔరా అనిపంచాడు.

ఇక ఈ ఏడాది విధ్వంసక ఇన్నింగ్స్‌లతో ఐపీఎల్ అభిమానులను ఒక ఊపు ఊపేసి టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్లో అభిమానులతో పాటు విశ్లేషకులు, మాజీల చర్చలన్నీ తన చుట్టూనే తిరిగాయి. ఈ ప్రదర్శనతో తనను టీమ్ఇండియాకు ఎంపిక చేయని పరిస్థితి కల్పించాడు వైభవ్. స్వయంగా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కరే ఈ విషయం చెప్పాడు. ఇప్పటిదాకా అండర్-19 జట్టుకు ఆడినా.. ఐపీఎల్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహించినా.. ఇండియా-ఎ జట్టు తరఫున బరిలోకి దిగినా.. వైభవ్ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఆడాడు. అందరి దృష్టీ తన మీదే నిలిచేలా చేశాడు. బౌలర్లను తనను చూసి బెంబేలెత్తేలా, ప్రత్యేకంగా వ్యూహాలు రూపొందించేలా చేశాడు.

తనను కట్టడి చేయడానికి మూడు రకాల వ్యూహాలున్నాయన్న సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్‌కు అతనెలా చుక్కలు చూపించాడో తెలిసిందే. తాజాగా 'ఎ' జట్ల ముక్కోణపు సిరీస్‌లో శ్రీలంక ఆటగాళ్లు తనను కవ్విస్తే.. ఫైనల్లో మెరుపు ఇన్నింగ్స్‌తో వారికి ఎలా బుద్ధి చెప్పాడో అభిమానులు చూశారు. ఇలాగే అంతర్జాతీయ క్రికెట్లోనూ మెరుపులు మెరిపించి టీమ్ఇండియాలో కొత్త సూపర్ స్టార్‌గా ఎదుగుతాడని.. తన ఆకర్షణతో స్టేడియాలను నింపుతాడని.. టీవీల ముందు కూడా కోట్లాది మందిని కూర్చోబెడతాడని వైభవ్ మీద అంచనాలున్నాయి. జింబాబ్వే సిరీస్‌తో ఆ దిశగా ఆశలు రేకెత్తించాడు. మరి ముమ్మందూ ఇంతే నిలకడగా రాణించి నవతరం సూపర్ స్టార్‌గా మారతాడేమో చూడాలి.

# ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్.. ఇషా సింగ్‌కు స్వర్ణం

హాంగ్‌ఝౌలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో భారత యువ షూటర్ ఇషా సింగ్ సత్తాచాటింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఒలింపిక్ పతక విజేత మనూ బాకర్‌ను ఓడించి ఇషా సింగ్ స్వర్ణ పతకం సాధించింది. ఫైనల్‌లో ఈ హైదరాబాదీ షూటర్ నిలకడ ప్రదర్శించి 40 హిట్స్‌తో బంగారు పతకాన్ని గెల్చుకుంది. కాంస్య పతకం కోసం మనూ బాకర్ పోరాడాల్సి వచ్చింది. షూట్ ఆఫ్‌ను దాటుకుని వచ్చిన మను.. 28 హిట్స్‌తో మూడో స్థానంలో నిలిచింది. అంతకు ముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్ లో భారత షూటర్లు అదరగొట్టారు. మనూ బాకర్ 586-20x స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా.. 21 ఏళ్ల ఇషా సింగ్.. 585-18x స్కోరుతో రెండో స్థానంలో నిలిచినప్పటికీ ఫైనల్‌లో మాత్రం అదిరిపోయే ప్రదర్శనతో స్వర్ణ పత కాన్ని కొల్లగొట్టింది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314